

హైదరాబాద్ వార్త

# విదేశీయుల వివరాల నమోదుపై నజర్

* 24 గంటల్లోపు ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి
* నోటీసులు జారీ చేస్తున్న పోలీసులు

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త**

నగరంలో నివసిస్తున్న విదేశీయుల వివరాల నమోదుపై నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆన్‌లైన్‌లో విదేశీయుల వివరాలను రిజిస్ట్రేషన్ అధికారికి అందజేయాలని సూచిస్తున్నారు. గృహ యజమానులు, నిర్వాహకులు, పరిపాలన అధికారులు ఎఫ్ఆర్ఆర్ఓకు సంబంధించిన వివరాలను సమర్పించాలని సూచిస్తున్నారు. నగరంలోని అన్ని పోలీసు ఠాణాల్లో ఈ అంశంపై స్థానిక పోలీసులు ఇప్పటికే సంబంధిత సంస్థలకు, గృహ సముదాయాలకు, హాస్టల్ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చేవారు, వృత్తులలో స్థిరపడే వారి వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

**నగరంలోనే అత్యధికంగా...**

తెలంగాణలో వేలసంఖ్యలో విదేశీయులు నివసిస్తుండగా, వారిలో అత్యధికంగా నగరంలోనే ఉంటున్నారు. వీరిలో ఎక్కువగా విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వైద్య చికిత్స కోసం వచ్చినవారు, ఇతర వీసాలపై వచ్చిన విదేశీయులున్నారు. నగరంలో విదేశీయుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో వారి వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదై ఉండేలా ఈ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం-2025 ప్రకారం హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, గృహ యజమానులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు నిర్ణీత ఫారాల ద్వారా విదేశీయుల వివరాలను 24 గంటల్లోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని పోలీసులు సూచిస్తున్నారు.



నిర్వాహకుడికి విదేశీయుల వివరాల నమోదు పత్రాన్ని అందిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు

సంబంధిత రికార్డులను కనీసం ఏడాదిపాటు భద్రపరచాలని సూచిస్తున్నారు. ఇందుకోసం ఎఫ్ఆర్ఆర్ఓకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటుచేసి సంబంధిత వ్యక్తులకు, సంస్థలకు వాటి గురించి పోలీసులు వివరిస్తున్నారు. వచ్చే విదేశీయులలో అత్యధికంగా ఆసుపత్రికి వచ్చే వారు, వారి సహాయకులతో వస్తుంటారు. ఈ క్రమంలోనే సహాయకుల వివరాలను ఖచ్చితంగా పోర్టల్‌లో నమోదు చేయాలని సూచిస్తున్నారు. హోటల్, వసతిగృహం ఇతర నివాస ప్రాంగణానికి సంబంధించిన యజమాని లేదా బాధ్యత వహించే వ్యక్తి విదేశీయుల వివరాలను రిజిస్ట్రేషన్ అధికారికి తెలియజేయాలని సూచిస్తున్నారు. అలాగే విదేశీయుల రాక, బయలుదేరే వివరాలను నమోదు చేయించుకోవడంతోపాటు, నిర్వహణ సంస్థ నిర్ణీత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం-3ను 24 గంటల్లో ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచిస్తున్నారు. ప్రధానంగా చదువుకోవడానికి వచ్చే విదేశీ విద్యార్థులకు సంబంధించి వివరాలను విద్యాలయాలు రిజిస్ట్రేషన్ అధికారికి సమర్పించాలి. ఫారం-2ను విద్యాసంస్థల్లో చేరిన విదేశీ విద్యార్థులు తమ వివరాలను ఫారం-2లో, హాస్టల్ వసతి కల్పించిన విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం-3లో నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రవేశం, వసతి కల్పించిన 24 గంటల్లో ఈ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో సమర్పించాలి.

**ఉల్లంఘనలపై చర్యలు**

విదేశీయుల వివరాల నమోదులో ఆలస్యం లేదా నిర్లక్ష్యం జరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిబంధనలను మరింత కఠినంగా అమలు చేస్తున్నారు. నిబంధనలు పాటించని గృహ యజమానులు, సంస్థల నిర్వాహకులు, బాధ్యులపై ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టంలోని సెక్షన్లు 20, 23, 24 కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. విదేశీయుల వివరాలను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అధికారిక ఎఫ్ఆర్ఆర్ఓ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని పోలీసులు సూచించారు. అంతేకాకుండా నగరంలో విదేశీయులు ఎక్కువగా నివసించే ప్రాంతాలను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగరీత్యా, వృత్తిరీత్యా వచ్చే విదేశీయులతో పాటు, స్థిరపడేవారు ఎక్కువగాఉంటారు. అలాగే నగర పరిధిలోని టోలిచౌకి ప్రాంతంలోనూ విదేశీయులు ఎక్కువగా నివస్తూ విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ నమోదు ద్వారా విదేశీయులకు సంబంధించి స్పష్టమైన వివరాలను సేకరించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారి వివరాలను గుర్తించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా పాస్‌పోర్టులు కాలంతీరినా తిష్ట వేసి ఉండేవారిపై పోలీసులు దృష్టిసారించే అవకాశం ఉంది. నగరంలోని అన్ని ఠాణాల్లో ఇప్పుడు నమోదు కార్యక్రమాన్ని వేగవంతంచేశారు.

# వామ్మో లిఫ్ట్..నేను ఎక్కను.!

* వరుస ఘటనలతో నగరవాసుల బెంబేలు
* నాణ్యత లేమి..నిర్వహణ లోపంతో ప్రమాదాలు
* ఆఫీసులు, అపార్ట్‌మెంట్‌లలో లిఫ్ట్ ఎక్కాలంటే భయం



**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** నగరంలో లిఫ్ట్ ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇటీవల జరిగిన వరుస సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పలు ఆఫీసుల్లో, అపార్ట్‌మెంట్‌లల్లో లిఫ్ట్ చూడగానే జనం భయపడుతున్నారు. అవసరమైతే నడుచుకుంటూ దిగుతాం కానీ లిఫ్ట్ ఎక్కమని చెబుతున్నారు. ఇటీవల నాంపల్లిలో చిన్నారి అర్ణవ్ లిఫ్ట్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన.. మెహదీపట్నంలోని ఓ హాస్టల్ లిఫ్ట్‌లో ఇరుక్కుని ఏడాదిన్నర వయసున్న బాలుడు మృత్యువాత అలాగే ఆర్సీ పురంలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. లిఫ్ట్‌లో ఇరుక్కుని నాలుగేళ్ల బాలుడు గిరిధర్ మృతి చెందాడు. తాజాగా హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో ప్రమాదం జరిగింది. ఓఅపార్ట్‌మెంట్‌లో కొత్త ఫ్లాట్ చూసేందుకు వెళ్లిన కుటుంబానికి ఊహించని షాక్ తగిలింది. ఐదో అపార్ట్ మెంట్లోని ఫ్లాట్ చూసేందుకు వారు వెళ్లగా ఒక్కసారిగా అది గ్రౌండ్‌ఫ్లోర్‌పై కూలిపోయింది. ఈ ప్రమాదంలో విశ్రాంత జ్యుడిషియల్ ఉద్యోగి నరసింహస్వామితో పాటు అతడి బంధువులు ఎనిమిది మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఎల్బీనగర్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

**ఎందుకిలా...**

ఈ వరుస లిఫ్ట్ ప్రమాదాలు నగర ప్రజలను భయపెట్టేలా మారాయి. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, పాత లిఫ్ట్‌ల మరమ్మతు చేయకపోవడం, నిర్లక్ష్యంగా నిర్వహించడం వంటి కారణాలతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలోని లిఫ్ట్‌లు సాంకేతికంగా మెరుగుపరచాలి. రెగ్యులర్‌గా లిఫ్ట్‌లను పరీక్షించి మరమ్మతులు చేయాలి. పిల్లలు లిఫ్ట్‌లో ప్రయాణిస్తున్నప్పుడు పెద్దలు పర్యవేక్షణ చేయాలి. ఎమర్జెన్సీ అలర్ట్ సిస్టమ్, ఆటోమేటిక్ సెన్సార్లు అమర్చేలా చర్యలు తీసుకోవాలి. ఈ ప్రమాదాలు మరింత మందిని బలిచేయకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లిఫ్ట్‌ల భద్రతను పటిష్ఠంగా అమలుచేయకుంటే, ఇలాంటి విషాద ఘటనలు మరింత పెరిగే అవకాశం ఉంది.

తెలంగాణ ఎలివేటర్స్ అండ్ ఎస్కలేటర్స్ అసోసియేషన్(టీఈఈఏ) లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా దాదాపు 10 వేల ఎలివేటర్లను విక్రయిస్తున్నారు. వీటిల్లో 20 శాతమే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల ప్రకారం ఉంటున్నట్లు అంచనా. మిగిలిన 80 శాతం నైపుణ్యం లేని తయారీదారులు విక్రయిస్తున్నవే కావడం గమనార్హం. తయారీసంస్థల దగ్గర అయిదారునెలలు పనిచేసిన కార్మికులే సొంతంగా ఎలివేటర్లను తయారుచేస్తున్నారు. బిల్డర్లవద్ద తక్కువ ధరలకు కాంట్రాక్టులు తీసుకుని ఎలివేటర్లను సరఫరా చేసి బిగిస్తున్నారు. మరోవైపు అపార్ట్‌మెంట్ సంఘాలు నెలవారీ నిర్వహణను పట్టించుకోకపోవడం వంటి కారణాలతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు తెలుస్తోంది. లిఫ్ట్ ఏర్పాటుచేశాక ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటు నిరభ్యంతర పత్రం జారీ చేయాల్సి ఉన్నా చట్టం లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. అపార్ట్‌మెంట్ సంఘాలు నెలవారీ రూ.2 వేలవరకు నిర్వహణ వ్యయాన్ని విస్మరిస్తుండటం ప్రమాదాలకు కారణమవుతుంది. క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది కొందరు లంచాలకు అలవాటు పడి లిఫ్ట్‌లకు ఎంత లోడు కరెంటు కనెక్షన్ ఇస్తు న్నారనేది తనిఖీ చేయడం లేదనే ఆరోపణలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

విదేశీ ఉద్యోగం పేరుతో యువతిని మోసగించిన

## అయిదుగురిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త :** అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి లక్షల రూపాయలు వసూలుచేసి మోసానికి పాల్పడిన అయిదుగురిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వైష్ణవి బోయిడి సిగ్నా ఎల్ఎల్‌సీ, సిగ్నా సొల్యూషన్స్ సంస్థతోపాటు అలీ బాఖురి, శ్రీతి కార్మాకర్, హుస్సేన్ బాఖురి, తరుణ్ అమెరికాలో ఉద్యోగావకాశం కల్పిస్తామని నమ్మించారు. ఆమెను నమ్మించి ఉద్యోగానికి సంబంధించిన నకిలీ పత్రాలు అందజేసి, వీసా ప్రక్రియ కోసం తిరిగి చెల్లిస్తామని చెప్పి రూ.3.95 లక్షలను సెక్యూరిటీ డిపాజిట్‌గా తీసుకున్నారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు తాను ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి అమెరికాకు వెళ్లింది. అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు ఉద్యోగపత్రాలు నకిలీవని గుర్తించి దేశంలోకి ప్రవేశ అనుమతికి నిరాకరించారు. అనంతరం ఆమె వీసాను రద్దు చేసి, అయిదేళ్లపాటు అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధం విధించి తిరిగి భారత్‌కు పంపించారు. ఈ సంఘటనపై బాధితురాలు వారిని నిలదీయగా రూ.4 లక్షలు చెల్లించి ఒక అంగీకార పత్రంపై సంతకాలు చేయించుకున్నారు. అయితే తనకు మొత్తం సుమారు రూ.12 లక్షల మేర నష్టం జరిగిందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. మోసపూరితంగా నమ్మించి డబ్బు వసూలు చేసి ఆర్థికంగా నష్టపరిచారని ఆరోపిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్లు 316(2), 318(4), 3(5) కింద మాసాబ్‌ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసి జూబ్లీహిల్స్ ఠాణాకు బదిలీ చేయగా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రక్తమోడుతున్న హైటెక్‌సిటీ రహదారులు
## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు



**గచ్చిబౌలి, జూన్ 27 ప్రభాతవార్త :** హైటెక్ సిటీ రహదారులు వరుస ప్రమాదాలతో రక్తమోడుతున్నాయి. కొండాపూర్ ఫ్లైఓవర్ మీద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటన జరిగిన ఒక్కరోజులోనే గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలో మరో రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. శనివారం చోటుచేసుకున్న రెండు వేరువేరు ప్రమాదాల్లో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...

గచ్చిబౌలి రాజీవ్‌నగర్‌నగర్ ఇయర్‌వ్యూ అపార్టుమెంటు ప్లాటు నెంబరు 101లో నివాసం ఉండే అబ్బి ఆనంద్‌సింగ్(27) ఐటి కారిడార్ పరిధిలోని డిలాయిట్ సాఫ్ట్‌వేర్ సంస్థలో హెచ్ఆర్ అనలిస్టుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఆనంద్‌సింగ్ ద్విచక్రవాహనం(టిజి07 ఎజీ7495)పై గచ్చిబౌలి నుంచి ఖాజాగూడ చెరువు రోడ్డు మీదుగా ప్రయాణిస్తున్నాడు. అతని వాహనం ఇంజనీరింగ్ స్టాఫ్‌కాలేజీ గేటు ముందుకుచేరుకోగా, ముందు వెళ్తున్న ద్విచక్రవాహనం (టిఎస్07జిఎక్స్ 4523) నిర్లక్ష్యంగా, వేగంగా యూటర్న్ వద్ద మలుపు తిప్పేందుకు ప్రయత్నించాడు. దీంతో వెనుక ఉన్న ఆనంద్‌సింగ్ వాహనం ముందువెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆనంద్ సింగ్ వాహనంపై నుంచి కిందపడడం తో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా నిర్లక్ష్యగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు సదరు వ్యక్తిని గుర్తించినట్లు తెలిపారు.

**మరో సంఘటనలో మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని...**



రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోనే చోటు చేసుకున్న మరో ప్రమాదంలో వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన కారు ఓ ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులను ఢీకొట్టడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం...బోరబండకు చెందిన తలారి కళ్యాణి(30) విల్స్ ఫార్గో-ఎన్‌టిటి డేటాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తుంది. శనివారం ఉదయం 8గంటల ప్రాంతంలో కళ్యాణి భర్త చింతల నరేష్‌తో కలిసి టివిఎస్ జుపిటర్‌పై గచ్చిబౌలి నుంచి రాయదుర్గం దాబా చౌరస్తా వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో బయోడైవర్‌సిటీ జంక్షన్ దాటిన తరువాత పక్వాన్ హోటల్ సమీపంలో వీరు యూటర్న్ తీసు కుంటుండగా, వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన ఇన్నోవా కారు (ఎపి26 బిఎల్4554) ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కళ్యాణితోపాటు ఆమె భర్త నరేష్‌లకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే వీరిని సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కళ్యాణి మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించగా, భర్త నరేష్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు రాయదుర్గం పోలీసులు కళ్యాణి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేపట్టారు.

కాగా శుక్రవారం కొండాపూర్ ఫ్లైఓవర్‌మీద జరిగిన ప్రమాదం లో ఇద్దరు మృతిచెందడంతోపాటు ఒక వ్యక్తి గాయపడ గా, ఒక్కరోజు వ్యవధిలోనే మరో రెండు ప్రమాదాల్లో మరో ఇద్దరు చనిపోవడం ఐటి కారిడార్‌లో విషాదాన్ని నింపింది.

## మెట్రో అదనపు ఎండిగా అజిత్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా విభాగంలో మరో కీలక నియామకం చేపట్టింది. ఇన్వెస్ట్ తెలంగాణ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న సీనియర్ అధికారి అజిత్‌రెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. ఆయనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఐటీ అండ్ సీ శాఖ పరిధిలోని 'ఇన్వెస్ట్ తెలంగాణ' సిఈవోగా సేవలు అందిస్తున్న అజిత్‌రెడ్డికి తదుపతి ఉత్తర్వులు వచ్చే వరకు హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండి పోస్టుకు సంబంధించిన పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులో పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టులు వేగవంతం అవుతున్న తరుణంలో ఈ కీలక పోస్టులో అజిత్‌రెడ్డి నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.

## నేడే పల్స్ పోలియో..

**ఇంటింటికి తిరిగేందుకు 11,500 మంది సిబ్బంది**

**జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల పిలుపు**

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** నిండు ప్రాణానికి రెండు చుక్కలు అని పోలియో రహితసమాజమే మనముందున్న లక్ష్యమని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. జాతీయ టీకాదినోత్సవం సందర్భంగా జూన్ 28వ తేదీన నగర వ్యాప్తంగా "పల్స్ పోలియో "కార్యక్రమం విస్తృతంగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచితంగా పోలియో చుక్కలు అందించడం జరుగుతుందని, తల్లిదండ్రులు తప్పక పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అలాగే ఇంటింటి సర్వే ద్వారా జూన్ 29నుంచి జూలై 1 వరకు పోలియో బూత్‌లలో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలు 5,04,803 మంది ఉన్నారని, 2,800 పోలియో బూత్‌లు, 38 సంచార బృందాలు(రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లు, మెట్రోస్టేషన్లు తదితర ప్రాంతాల్లో) 91 మొబైల్ బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందనితెలిపారు. అలాగే నిర్మాణ ప్రదేశాలు, వలసకూలీల కాలనీలు, సంచారజాతులు, బిచ్చగాళ్ల నివాస ప్రాంతాలు, మార్కెట్లు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, ఉద్యానవనాలు తదితర ప్రాంతాలలో ప్రత్యేక బృందాలు సేవలందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు అలాగే ఇతర ప్రభుత్వశాఖల సిబ్బంది మొత్తం 11,500 మందికిపైగా ఈ కార్యక్రమ నిర్వహణకు నియమించినట్లు తెలిపారు.



## ఫుట్‌పాత్‌లపై వెలిసిన డబ్బాలు తొలగించిన అధికారులు

**నార్సింగి, జూన్ 27 ప్రభాతవార్త :** గండిపేట గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా వెలిసిన డబ్బాలు, నిర్మాణాలను శనివారం నార్సింగి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీలతో తొలగించారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రసీద ఆదేశాల మేరకు టిపిఓ రమేష్ తన సిబ్బందితో గండిపేటకు వెళ్లి రోడ్డుకు ఇరువైపులా షెటర్ల ముందు అక్రమంగా నిర్మించిన షెడ్లు, డబ్బాలు సుమారు 50.వరకు తొలగించారు. గోల్కొండ రీసార్టు నుంచి సాయిబాబా దేవాలయం వరకు, దేవాలయం నుంచి గండి మైసమ్మ కమాన్, యూనియన్ బ్యాంకు వరకు ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలన్నీ తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రసీద మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకొని వ్యాపారాలు చేయడం వల్ల రోడ్లు కుంచించుకుపోయి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిని తొలగించాలని గండిపేట వాసులు ఫిర్యాదులు చేశారని, స్థానికంగా పరిశీలించి ఫుట్‌పాత్‌లను కబ్జాల చెరనుంచి విడిపించామన్నారు. ఇకనుంచి ఫుట్‌పాత్‌ల ఆక్రమణకు పూనుకుంటే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఏసీపీ ప్రసీద వివరించారు. అధికారుల చర్య పట్ల డబ్బాలు, షెడ్లు కోల్పోయినవారు బాధ పడుతున్నా, గండిపేట వాసులు ఆనందంను వ్యక్తం చేస్తున్నారు.

## ఫలక్‌నుమా కాళీమాత పూజారుల మధ్య ఘర్షణ కేసు

**- ట్రాన్స్‌జండర్ వీడియో వైరల్**

**చాంద్రాయణగుట్ట, జూన్ 27, ప్రభాతవార్త :** పాతబస్తీ ఫలక్‌నుమా కాళీమాత దేవాలయ పూజారుల మధ్య ఆర్థిక లావాదేవీల వ్యవహారం పోట్లాటకు దారితీసింది. పోలీసుస్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదుచేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...ఫలక్‌నుమా బ్రిడ్జి దిగువన, రైల్వేస్టేషన్ సమీపంలోగల కాళీమాత దేవాలయ పూజారులుగా జగన్, రాజు, జగదీష్, జంగయ్య కుటుంబీకులు వ్యవహరిస్తున్నారు. నలుగురు సోదరులలో ఇద్దరు పోలీసు డిపార్ట్‌మెంట్లో పని చేస్తున్నారు. గుడి నుండి వచ్చే ఆదాయాన్ని భాగాలుగా పంచుకుంటున్నారు. శుక్రవారం ఆలయంలో వచ్చిన ఆదాయాన్ని ఆలయ వలంటీర్లుగా పనిచేస్తున్న అంకిత్, నవీన్లు ఆటోలో తీసుకెళుతుండగా గమనించిన జంగయ్య ఆ ఆటోను వెంబడించి వారి వద్ద గల నగదును తీసుకోవటానికి ప్రయత్నించాడు. వారిపై చేయిచేసుకున్నాడు. వారు అతని నుంచి తప్పించుకొని పారిపోయారు. విషయం తెలుసుకున్న పూజారి పవన్ ఇద్దరు వలంటీర్లతో ద్విచక్ర వాహనంపై ఆలయం వద్దకు చేరుకొని, మంచినీటి క్యాన్లను పడవేస్తున్న జంగయ్య వద్దకు వెళ్ళి విచక్షణ రహితంగా దాడిచేశాడు. పవన్ దాడి సీసీ కెమెరాలలో నమోదైయింది. ఈ విషయమై జంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆలయ వలంటీర్లు అంకిత్, నవీన్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జంగయ్య, పవన్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఫలక్‌నుమా కాళీమాత దేవాలయం వద్ద ఉపాధి పొందే ఒక ట్రాన్స్‌జెండర్ వీడియా వైరల్‌గా మారింది. దేవాలయ నిర్వహణను చూసే కుటుంబీకులలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ఒక వ్యక్తి తనను లైంగింక వేధిస్తున్నాడంటూ, అతనిపై ఫలక్‌నుమా పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవటం లేదంటూ ఆ వీడియోలో పేర్కొంది. అయితే ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ జంగయ్య మాత్రం ఆ వీడియోలో చెప్పిన విధంగా ఎలాంటి కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు.

## సీసీటిలో గ్రామీణ సంత ప్రారంభం

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త :** బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ(సీసీటి)లో గ్రామీణ సంత ప్రారంభమైంది. గ్రామ భారతి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సంతను బీసీ వెల్ఫేర్ అదనపు సంచాలకులు అలోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామభారతి ప్రతినిధులు పలుస కరుణాకర్‌గౌడ్, లింగం, మోహన్, పివిరావు తదితరులు పాల్గొన్నారు. రసాయన రహిత సేద్యంతో తయారు చేసిన రైతుల ఉత్పత్తులు, ఆహార పదార్థాల స్టాల్స్, చేతివృత్తుల ఉత్పత్తులు, చేనేత ఉత్పత్తులను ఇక్కడ ఏర్పాటుచేశారు.

## టాటా ఏస్ వాహనం ఢీకొని బాలుడు మృతి



**ముషీరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** టాటాఏస్ వాహనం ఢీకొని ఒక బాలుడు మృతి చెందిన సంఘటన ముషీరాబాద్ నియోజకవర్గం, భోలక్‌పూర్‌లో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం...భోలక్‌పూర్‌కు చెందిన మహేష్ గౌడ్, సంతోషి దంపతులకు శ్రీయాన్స్(4), లతిక అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం శ్రీయాన్స్ తల్లి సంతోషితో కలసి గంగపుత్ర కాలనీలో టిఫిన్ చేసేందుకు రోడ్డు పక్కన నడుచుచుంటూ వెళ్తున్న సమయంలో టాటాఏస్ వాహనం(టీజీ 09యు1011) ఎదురుగావచ్చి శ్రీయాన్స్‌ను ఢీకొట్టింది. వాహనం ముందర టైర్లు శ్రీయాన్స్ మీదుగా వెళ్లటంతో అక్కడి కక్కడే మృతిచెందాడు. ఇది గమనించిన సంతోషి ఏడుస్తూ గట్టిగా కేకలు వేయటంతో డ్రైవర్ అయూబ్ వాహనాన్ని వదిలేసి పారిపోయేందుకు ప్రయత్నించటంతో స్థానికులు పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ సీఐ రాజ్‌గోపాల్‌రెడ్డి, ఎస్ఐ లక్ష్మీనారాయణలు ఘటనా స్థలికి చేరుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. బాలుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ హాస్ప టల్‌కు తరలించి, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

**స్క్రాబ్, ఐరన్ గోదాములను తొలగించాలి : బిజెపి నేతలు**

భోలక్‌పూర్‌లో జనావాసాల మధ్య అనధికారికంగా కొనసాగుతున్న ప్లాస్టిక్, స్క్రాబ్ గోదాములు, దుకాణాల వల్ల నిత్యం అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, దళిత మోర్చా నాయ కులు గడ్డం నవీన్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు అనిల్‌కుమార్ ఆరోపించారు. శ్రీయాన్స్‌పై నుంచి వాహనం వెళ్లటాన్ని నిరసిస్తూ వారు రోడ్డుపై భైఠా యించి, నిరసన తెలిపారు. జనావాసాల మధ్య ఈ గోదాములు ఉండటంవల్ల గతంలోనూ అనేక మంది ప్రమాదాల బారినపడి, మృతి చెందారని తెలిపారు. ఈ గోదాముల వల్ల మంచి నీరు కూడా కలుషితం అవుతోందని, 2009లో 14 మంది కలుషిత నీటి వల్ల మృతిచెందారని గుర్తుచేశారు. ఇటువంటి ఘట నలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ప్రభుత్వానికి, జీహెచ్ ఎంసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏసీపీ యాదగిరి, రఘువీరారెడ్డి, సీఐ రాజ్‌గోపాల్ రెడ్డి, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణ తదితరులు రోడ్డుపై భైఠాయించిన వారికి సర్ది చెప్పటంతో ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న బిజెపి నేతలు

# భవన నిర్మాణ కూల్చివేత వ్యర్థాలు ప్రాసెసింగ్ ప్లాంట్‌కే తరలించాలి

**ఖాళీ ప్రదేశాలు, నాలాలో పారబోస్తే రూ.25వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానాలు, వాహనం స్వాధీనం**

**ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**





మాట్లాడుతున్న ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, చిత్రంలో అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :** భవన నిర్మాణ కూల్చివేత వ్యర్థాలు తరలింపులో నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో భవన నిర్మాణ కూల్చివేత వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల ప్రతినిధులు, బిల్డర్లు, కాంట్రాక్టర్లతో సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని రోడ్లు, ఖాళీ స్థలాలు, నాలాలు ఇతర అనధికారిక ప్రదేశాల్లో భవన నిర్మాణ వ్యర్థాలను పారబోయడాన్ని నిషేధించినట్లు తెలిపారు. అలాంటి చర్యలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యక్తులు, వాహన యాజమానులు, రవాణా నిర్వాహకులపై జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా చేపడతామని హెచ్చరించారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తరలించే అన్ని వాహనాలు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందిన భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లకే వ్యర్థాలను తరలించాలని, అక్కడ శాస్త్రీయ పద్ధతుల్లో వాటి పారవేత, రీసైక్లింగ్ జరిగేలా చూడాలని సూచించారు. 20 వేల చదరపు మీటర్లకు పైబడిన నిర్మాణాలు, రోడ్లు, మౌలిక సదుపాయాల పనుల్లో ప్రాసెస్ చేసిన భవన నిర్మాణ వ్యర్థాల వినియోగం తప్పనిసరి అని వివరించారు. భవన నిర్మాణ కూల్చివేత సేకరణ రవాణా ఛార్జీలు టన్నుకు రూ.426లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఒకవేళ స్వంత వాహనంలో తరలిస్తే టన్నుకు రూ. 106.50లుగా నిర్ణయించినట్లు కమిషనర్ వివరించారు. అధిక లోడ్‌తో రవాణా చేసిన, ఎక్కడపడితే అక్కడ పారబోసిన మొదటి తప్పిదానికి రూ.25 వేలు జరిమానా, రెండవసారి రూ.50వేలు, మూడో తప్పిదానికి రూ.లక్ష జరిమానాతో పాటు వాహన స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అలాగే భవన నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా తరలించేందుకు, డంపింగ్‌చేయించేందుకు బాధ్యులైన నిర్మాణ యాజమానులు, కాంట్రాక్టర్లు లేదా సంబంధిత సంస్థలపై ప్రతి ఉల్లంఘనకు రూ.50వేలు జరిమానా విధించబడుతుందని స్పష్టం చేశారు. అక్రమ డంపింగ్ వల్ల ప్రజారోగ్యం, పర్యావరణం, నగర పరిశుభ్రతకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనలు, జరిమానాలు, శిక్షల గురించి సమావేశంలో వివరించారు. నగరాన్ని పరిశుభ్రంగా, సురక్షి తంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. శంషాబాద్, తూముకుంటలోని ప్రాసెసింగ్ ప్లాంట్ టోల్ ఫ్రీ నెంబర్ 18002030033 అలాగే వాట్సాప్ నెంబర్ 7330000203, జీడీమెట్ల, ఫాతుల్లాగూడ ప్రాసెసింగ్ ప్లాంట్ టోల్ ఫ్రీ నెంబర్ 18001201159 వాట్సాప్ నెంబర్ 9705433369ను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు. వీరిని సంప్రదిస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం భవన నిర్మాణ వ్యర్థాలను తీసుకోని వెళతారని వివరించారు.

# ఎంఎస్‌ఎంఈలపై పెరుగుతున్న ఒత్తిడి

**- సగటు బకాయిలు రూ. 3.83 కోట్లు- రికార్డెంట్ ఇండియన్ ఎస్‌ఎంఈ రిసీవబుల్స్ రిపోర్ట్ -2026లో వెల్లడి**

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త:** దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ(ఎంఎస్‌ఎంఈ)లు వర్కింగ్ క్యాపిటల్ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని రికార్డెంట్ ఇండియన్ ఎస్‌ఎంఈ రిసీవబుల్స్ రిపోర్ట్ -2026 వెల్లడించింది. ఒక్కో సంస్థ సగటున రూ. 3.83 కోట్ల విలువైన బకాయిలు ఏడాదికిపైగా పెండింగ్‌లో ఉన్నాయని తేల్చిచెప్పింది. ప్రపంచ ఎంఎస్‌ఎంఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రికార్డెంట్ సంస్థ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఈ నివేదికను విడుదల చేసింది. 1.1 లక్షల ఎంఎస్‌ఎంఈల నుంచి సేకరించిన 10 లక్షలకు పైగా లావాదేవీల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఇందులో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల నగదు ప్రవాహం తీవ్రంగా దెబ్బతింటుంది. దీంతో వ్యాపార విస్తరణ, పెట్టుబడులు, ఆర్థికస్థిరత్వంపై పడుతుందని నివేదికలో పేర్కొన్నారు. భారత జీడీపీలో సుమారు 30 శాతం వాటా, దేశ ఎగుమతుల్లో 48 శాతం వాటాను ఎంఎస్‌ఎంఈ రంగం కలిగి ఉందన్నారు. వ్యవసాయ రంగం తరువాత అత్యధిక ఉపాధి కల్పించే రెండో రంగంగా ఉన్నప్పటికి బకాయిల చెల్లింపులో ఆలస్యం ప్రధాన సవాలుగా మారిందని నివేదిక పేర్కొంది. దేశంలోని 82 శాతం కంటే ఎక్కువ ఇన్వాయిస్‌లు 30 రోజుల లోపు క్రెడిట్ గడువుతో జారీ అవుతున్నప్పటికి, చెల్లింపులు సగటున 73 రోజుల తరువాత అందుతున్నాయని తేల్చింది. మెట్రో నగరాల పరంగా పోలిస్తే ముంబైలో ఇన్వాయిస్‌ల చెల్లింపులు సగటున 59 రోజుల్లో పూర్తవుతుంది. జాతీయ సగటు కంటే ఇది మెరుగ్గా ఉంది. పరిశ్రమలు, వ్యాపార వర్గాల మధ్య చెల్లింపుల ధోరణి గణనీయమైన తేడాలు ఉన్నందున ప్రతి రంగానికి ప్రత్యేక బకాయిల నిర్వహణ వ్యూహాలు అవసరమని సూచించింది. ఈ సందర్భంగా రికార్డెంట్ వ్యవస్థాపకురాలు, సీఈఓ విన్నీపత్రో మాట్లాడుతూ.. చెల్లింపుల జాప్యాలు ఎంఎస్‌ఎంఈల వృద్ధి సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయని, ఇది కేవలం నగదు ప్రవాహ సమస్యనే కాకుండా రుణాలు పొందే సామర్థ్యం, వ్యాపార స్థిరత్వం, దీర్ఘకాలిక పోటీ సామర్థ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. భారత్ 5 ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా పయనిస్తున్న సమయంలో ఎంఎస్‌ఎంఈలకు సకాలంలో చెల్లింపులు అందేలా చూడటం, నగదు ప్రవాహాన్ని నిర్ధారించడం, దేశాభివృద్ధికి కీలకమన్నారు. కార్యక్రమంలో రికార్డెంట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



నివేదికను ఆవిష్కరిస్తున్న విన్నీ పత్రో తదితరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి

### ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూన్ 27 ప్రభాతవార్త:** బిఎల్‌ఏలు ప్రతి గడపకు వెళ్లి 18 ఏళ్లు పూర్తిచేసుకున్న అర్హులైన ప్రతి ఓటర్ పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చూడాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సూచించారు. శనివారం 1వ వార్డు పెన్షన్‌లైన్ ప్రభుత్వ పాఠశాల వద్ద నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల(బిఎల్ఏ)లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాతాలో 18 ఏళ్లు పూర్తి చేసుకున్న యువతీ, యువకులను ఓటర్ జాబితాలో నమోదు చేయించుకోవాలన్నారు. ఓటర్ జాబితాలో పేర్లు,వయసు,చిరునామాల్లో ఏమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రతి ఓటు లెక్కలోకి రావాలని, ఒక్క ఓటు మిస్ కాకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, సర్ నియోజకవర్గం కో ఆర్డినేటర్లు సంకి రవీందర్, మారుతీగౌడ్, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, బల్వంత్‌రెడ్డి, సదానంద్, రియాజుద్దీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు చేయించుకోవాలి



సర్ ప్రక్రియను పరిశీలిస్తున్న గజ్జెల నాగేశ్, పాండుయాదవ్

**కంటోన్మెంట్,జూన్ 27 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 6వ వార్డు బోయిన్‌పల్లి, 2వ వార్డు రసూల్ పురాలో నిర్వహించిన సర్ కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్,తెలంగాణ ఉద్యమ నేత గజ్జెల నాగేశ్,కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత సాయన్న, మాజీ బోర్డు మెంబర్ పాండు యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్‌లు సర్‌సర్వేను పర్యవేక్షించారు. ఓట్లు గల్లంతుకాకుండా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితాలో నమోదు చేయించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తైన వారి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చూడాలన్నారు. సర్ సర్వేలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. బి.ఎల్.ఓలు ఇంటింటికి వెళ్లి అందజేసే ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి తిరిగి వారికి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు దేవులపల్లి శ్రీనివాస్, కనుకయ్య,జంగిలి రాజు, కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు కొనసాగిన ఓటురు జాబితా పరిశీలన



ఓటరు జాబితా నమూనా పరిశీలనలో పాల్గొన్న విజయారెడ్డి

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త :** ఓటరు జాబితా సవరణ కార్యక్రమం(ఎస్ఐఆర్)లో భాగంగా నియోజకవర్గంలోని పలు పార్టీల నాయకులు ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం బాలాపుర బస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొని జాబితాను పరిశీలించారు. అలాగే వెంకటేశ్వరకాలనీ డివిజన్ దేవరకొండ బస్తీలో నిర్వహించిన జాబితా సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ నాయకులు, మాజీ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ప్రతాప్‌నగర్, సింగాడకుంట, గౌరిశంకర్ నగర్‌లో బీఎల్‌ఓ, బీఎల్ఏలతోకలిసి పర్యటించి జాబితాను పరిశీలించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఫిల్మ్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ డివిజన్ గౌతంనగర్‌లో బీఎల్‌ఓ, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికి తిరిగి పరిశీలించారు.

## పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీనే : విజయారెడ్డి

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త :** పేదల, మహిళలకు అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఖైరతాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పి. విజయారెడ్డి అన్నారు. సోమాజీగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలకు, బస్తీలకు చెందిన మహిళలకు ఆమె ఇందిరమ్మ చీరలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిద పండుగల సందర్భంగా మహిళలకు ప్రభుత్వం ఇందిరమ్మ చీరలను అందిస్తుందన్నారు. ప్రతిఒక్కరి సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజల సమస్య పరిష్కారంలో ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం థౌర్యత్రిక కూచిపూడి నృత్యవిన్యాస వేడుక

**రవీంద్రభారతి, జూన్ 27 ప్రభాతవార్త :** శాంకరి నృత్య సంగీత అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణుల థౌర్యత్రిక కూచిపూడి నృత్యవిన్యాసంనేత్రపర్వంగా జరిగింది. కళాకారిణులు కె.చంద్రలేఖ, శ్రీలత నారపరాజు, కె.కీర్తనరెడ్డిలు థౌర్యత్రిక కూచిపూడి నృత్యవిన్యాస వేడుకను ముందుగా రాగమాలిక రాగం తాళమాలిక తాళంలో శివస్తుతి; రాగమాలికరాగం మిశ్రచాపు తాళంలో అన్నమాచార్య కీర్తన; బేహాగ్ రాగం ఆదితాళంలో జావళి; మోహనరాగం తాళమాలిక తాళంలో తరంగం; సింహేంద్ర మధ్యమం-రూపకతాళంలో కామాక్షిస్తుతి; నవరగామాలిక రాగం ఆదితాళంలో వర్ణం తదితర అంశాల శృతి లయబద్ధం, అద్భుత హావభావ ప్రదర్శనతో తన్మయుల్ని చేశారు. నరపురాజు శ్రీలత నట్టువాంగం, మంథ శ్రీనివాస్ గాత్రం, ఎస్.నాగేశ్వర రావు మృదంగం, పవన్‌సింగ్ వయోలిన్, మంథ భరద్వాజ్ వేణువు, డా. ఆర్.శ్రీకాంత్ తబలా-పెర్కషన్స్‌పై సుమధురంగా వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ అతిథులు కళాకారులను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.



కళాకారిణుల థౌర్యత్రిక కూచిపూడి నృత్యవిన్యాసంలో ఒక దృశ్యం



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి

## ఆరోగ్యోకరమైన జీవితం ఎంతో ముఖ్యం

### - కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరికి ఆరోగ్యకరమైన జీవితం ఎంతో ముఖ్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ బడా గణేష్ సమీపంలోని పార్కులో, వెంకటేశ్వర కాలనీ డివిజన్ శ్రీనికేతన్ కాలనీలో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌లను ఆయన శనివారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. అంతకుముందు బడా గణేష్ వద్ద పార్కులో ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను గమనించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా మన ఆహారశైలి, జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజలకు అందుబాటులో ఉండేందుకు, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు అవసరమైన యంత్రాలను ఓపెన్ జిమ్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బడా గణేష్ సమీపంలో ఒక టిఫిన్ సెంటర్ వద్దకు వెళ్లి వారితో మాట్లాడుతూ టిఫిన్ చేశారు. కార్యక్రమంలో స్థానిక బీజేపి నేతలు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలి

### బిజెపి రాష్ట్ర నాయకులు చాతిరి పార్థసారథి

**చిక్కడపల్లి, జూన్ 27 (ప్రభాతవార్త):** ప్రతి ఓటరు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని బీజేపీ రాష్ట్ర నాయకులు చాతిరి పార్థసారథి అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని పలు బస్తీల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటరు వివరాల ధృవీకరణ ప్రాముఖ్యతను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు అవసరమైన వివరాలను సకాలంలో సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాధవరెడ్డి, జట్కార్ శ్రీను, సెన్సార్ బోర్డు సభ్యురాలు జ్యోతి, హర్ష, నర్సింహరాజు, ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించాలి: మాజీ కార్పొరేటర్

**చిక్కడపల్లి, జూన్ 27(ప్రభాతవార్త) :** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. డివిజన్ లోని 4, 10,16,17,18 నంబర్ బూత్‌లను సందర్శించి బూత్ స్థాయి అధికారులు, బీజేపీ బూత్ ఏజెంట్లతో కలిసి నిర్వహిస్తున్న ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమగ్ర ఓటర్ల జాబితా ప్రక్షాళనను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. అధికారులకు అవసరమైన సహకారం అందించేందుకు బీజేపీ బూత్ ఏజెంట్లు సిద్ధంగా ఉంటారని తెలిపారు. రెండు రోజుల ఆలస్యంగా ప్రారంభమైన ఎస్ఆర్ఐ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు నిర్ణయించిన గడువును మరోవారం రోజులు పొడిగించాలని ఎన్నికల అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, నాయకులు రత్నసాయిచంద్, దామోదర్, పూర్ణ, సాయిగౌడ్, శ్యామ్ పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్

## అభివృద్ధి పనులు ప్రారంభించిన మాజీ కార్పొరేటర్

**అల్వాల్, జూన్ 27 ప్రభాతవార్త:** ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి కృషిచేస్తున్నానని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్ నాథ్ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని క్రిష్ణానగర్‌లో 20లక్షలు వ్యయంతో సిసి రోడ్డు, 21లక్షలుతో సాయి సూర్య కాలనీ ఫేజ్ 2లోని పార్కు ప్రహారీ గోడ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, లడ్డు రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం సహాయ నిధి

### రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్

**బేగంపేట జూన్ 27,ప్రభాతవార్త :** పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ పాన్‌బజార్ కు చెందిన యెంద్ర లావణ్య,కళాసిగూడా కు చెందిన అగ్గిశెట్టి విశాల్ రెసిడెన్సీకి చెందిన లబ్దిదారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది పేదలకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు,ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తూ అండగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట డివిజన్ కాంగ్రెస్ నాయకులు డి.మల్లిఖార్జున్ లబ్దిదారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఎఎస్ఐ శ్యామలకు అంబాసిడర్ ఆఫ్ స్పోర్ట్స్‌అవార్డు

**బేగంపేట, జూన్ 27,ప్రభాతవార్త :** క్రీడారంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా బేగంపేట ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏఎస్సై వి.శ్యామలకు ప్రతిష్టాత్మక, అంబాసిడర్ ఆఫ్ స్పోర్ట్స్ అవార్డు అందుకున్నారు. మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణా ఆధ్వర్యంలో నగరంలోని ఎల్బీస్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, అసోసియేషన్ చైర్మన్ డా.కె.రాంరెడ్డి, యునైటెడ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.బి.లక్ష్మణ్ చేతుల మీదుగా శ్యామల ఈ పురస్కారాన్ని అందుకున్నారు. క్రీడల అభివృద్ధికి, యువతలో క్రీడా స్పూర్తిని పెంపొందించేందుకు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత శ్యామల ను పలువురు క్రీడా అభిమానులు,అభినందించి ఆమె భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



అంబాసిడర్ ఆఫ్ స్పోర్ట్స్ అవార్డు అందుకుంటున్న ట్రాఫిక్ ఎఎస్ఐ శ్యామల

# అర్హులైనవారు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సికింద్రాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా అధికారులు సమాచార సేకరణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం పద్మారావునగర్‌లోని హమాలీ బస్తీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. అధికారులతోకలిసి ఎన్యుమరేటర్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాతో కుటుంబ సమాచారాన్ని సరిచూసుకోవాలన్నారు. ఓటరు జాబితాలోని వారిలో ఎవరైనా మృతి చెంది ఉంటే ధృవీకరించుకొని పేరు తొలగింపుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన వారు ఉంటే ఓటరుగా నమోదు చేయించుకోవాలని బస్తీ వాసులను కోరారు. అర్హులైన ఓటర్ల పేరు జాబితాలో తొలగింపు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సుజాత, పద్మారావు నగర్ బిఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కమ్యూనిటీ హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలి...**

**సికింద్రాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** ప్రజలు కమ్యూనిటీహాల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. శనివారం పద్మారావునగర్‌లోని హమాలీ బస్తీవాసులకు, బన్సీలాల్ పేట డివిజన్‌లోని దీ క్లాస్ వాసులకు ఆయన వంటపాత్రలు, ఇతర సామగ్రిని అందజేశారు. ముందుగా హమాలీ బస్తీలోని కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై రూ. 2.10 లక్షల విలువైన సామగ్రిని బస్తీవాసులకు దాతలు హిమాన్షు బాప్నా, నందీశ్‌గౌడ్, బాల్‌రెడ్డి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బస్తీలలోని పేదల సౌకర్యార్థం కమిటీహాల్‌ను నిర్మించామన్నారు. వీటిలో అవసరమైన వంటపాత్రలు అందుబాటులో ఉంటే మరింత సౌఖ్యంగా ఉంటుందనే ఆలోచనతోనే దాతల సహకారంతో సమకూర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, బస్తీ వాసులు సుభాష్, శ్యామ్, కుషాల్ పాల్గొన్నారు.

**డీ క్లాస్‌లో...**

బన్సీలాల్‌పేటలోని దీ క్లాస్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1.50 లక్షల రూపాయల విలువైన సామాగ్రిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దాతలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా బస్తీ ప్రతినిధులు ధాతలను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుర్మ హేమలత, పార్టీ బస్తీ ప్రతినిధి మోహన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న సిఐ సైదేశ్వర్

## వ్యక్తిని మోసం చేసిన కేసులో సూర్యబాయి అరెస్ట్

**సైఫాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** బంగారం తక్కువ ధరకు ఇప్పిస్తానని మాయ మాటలతో రూ. 30 లక్షలు వసూలు చేసిన కేసులో సూర్యభాయిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.శనివారం నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సిఐ సైదేశ్వర్ మాట్లాడుతూ హైయత్‌నగర్‌కు చెందిన గోల్డ్ స్మిత్(బంగారు ఆభరణాల నిపుణుడు) కృష్ణమాచారిని సూర్యభాయి కలిసి తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని నమ్మించి, హిమాయత్‌నగర్‌లోని ఒక హోటల్‌లో 30 లక్షల రూపాయలు తీసుకోవడం జరిగిందన్నారు. డబ్బులు తీసుకున్న తరువాత బంగారం ఇవ్వకపోవడం, నగదు కూడా సూర్యభాయి చెల్లించకపోవడంతో కృష్ణమాచారి పోలీసులకు ఫిర్యాదు చేశారని సిఐ వివరించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సూర్యాభాయిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచామని ఆయన చెప్పారు. గతంలో సూర్యభాయిపై మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ కేసు నమోదైందన్నారు. ఆ కేసులో ఇద్దరి మధ్య వివాదాన్ని సెటిల్ చేస్తానని చెప్పి సూర్యాభాయి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని, దీనిపై మరిన్ని వివరాలను సేకరిస్తున్నామని సైదేశ్వర్ చెప్పారు.

## సింఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్,జూన్ 27 ప్రభాతవార్త:** తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన యాదమ్మ మెదడు శస్త్ర చికిత్స కోసం బాదపడుతుంది. నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం మంజూరైన రూ.3.25 లక్షల ఎల్‌ఓసీ మంజూరుపత్రాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు లింగాని ప్రసన్న, శైలజా, బిఆర్ఎస్ నేతలు నక్క మధు, లింగాని శ్రీనివాస్,ఎండి ఇస్మయిల్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి ఎంఎస్‌ఎంఇ కీలకం

**కంటోన్మెంట్, జూన్ 27 ప్రభాతవార్త:** దేశాభివృద్ధికి, ఉపాధి కల్పనకు అర్థిక వ్యవస్థల బలోపేతానికి ఎంఎస్ఎంఇలు కీలక శక్తిగా నిలుస్తాయని తెలంగాణ రాష్ట్ర ఏఐపీసీ, ఎంఎస్‌ఎంఈ హైదరాబాద్ జిల్లా అధిపతి బానుమూర్తి బైరోజు తెలిపారు. ఏఐపీసీ, ఎంఎస్ఎం.ఈ వర్టికల్ తెలంగాణ రాష్ట్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మహేంద్రహిల్స్‌లో ఏర్పాటు చేసిననప్రపంచ ఎంఎస్‌ఎంఈ దినోత్సవ వేడుకలకు తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్‌కార్పోరేషన్ చైర్మన్,సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్, మాజీ డిప్యూటీ ఛీఫ్ ఇంజనీర్ లక్ష్మణ్ రావ్,మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్‌రావ్ పాల్గొని వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : జెంఆర్

**కంటోన్మెంట్, జూన్ 27 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లి సంజీవయ్యనగర్‌లోని శ్రీమాతా రేణుకఎల్లమ్మ 7వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయానంద్, వాసు, రాజు, వరద రాజు, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే దానం



ఆలయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, మామిడి నర్సింగ్‌రావు

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త :** ఫిల్మ్‌నగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. ఫిల్మ్‌నగర్ బీజేఆర్‌నగర్ సమీపంలోని డీఎస్‌ఆర్ వ్యాలీలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్‌నగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు పద్మ, మారెమ్మ, జగన్, నగేష్, ఆకుల రాజు తదిరులతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామినిచ్చారు.

## పాత దేవుళ్లపటాలను సేకరించి రీసైకిల్ చేసి ఉపయోగంలోకి తెస్తాం



పాత దేవుళ్ల పటాలను సేకరణలో దేవర శ్రీనివాస్ తదితరులు

**కార్వాన్, జూన్ 27 (ప్రభాతవార్త) :** కార్వాన్ ఆర్యసమాజ్‌లో భక్తులు ఉంచిన పవిత్రమైన పాతబడిన దేవుళ్ల పటాలను రిషి స్వచ్ఛంద సంస్థ అధిపతి రిషి బృందం పటాలను స్వీకరించారు. ఆలయ సేవకులు నరసింహాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంఘసేవకులు దేవర శ్రీనివాస్ పాల్గొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. పాత పటాలను స్వీకరించి దాన్ని విడివిడి భాగాలు విభజించి,వాటిని రీసైకిల్‌చేసి మళ్లీ ఉపయోగంలోకి తీసుకోరావడం జరుగుతుందన్నారు. దేవుడి గుడి దగ్గర పెట్టే పాత దేవుడి ఫోటోలను రిషి సంస్థ ఉద్యమంగా స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోపి సాగర్,వెంకటేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ఫామ్స్ పంపిణీ

**కార్వాన్, జూన్ 27 (ప్రభాతవార్త) :** మెహిదీపట్నం డివిజన్ పరిధిలో ఓటర్ల జాబితా సవరణ ఫామ్స్ బిఆర్ఎస్ పార్టీ మెహదీపట్నం డివిజన్ అధ్యక్షుడు మెట్టు నటరాజ్‌కుమార్ పర్యవేక్షణలో బూత్ స్థాయి అధికారులు శిరీష, రమేష్, ఇబ్రహీంలు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెట్టు నటరాజ్ మాట్లాడుతూ, ఓటర్ల నమోదు ప్రక్రియలోభాగంగా బూత్‌స్థాయి అధికారులు ప్రతి ఇంటిని మూడుసార్లు సందర్శిస్తారని, ఓటర్ల నమోదు ఫారాల పంపిణీ, వాటిని తిరిగి సేకరించేందుకు ఈ పర్యటనలు చేస్తారన్నారు. పాత ఓటర్ల జాబితా ఆధారంగా ఓటర్లు తమ పేరును, అలాగే కుటుంబ సభ్యుల పేర్లను సరిచూసుకుని, నమోదుఫారంలో వివరాలను భర్తీచేయాలని సూచించారు. ఓటర్లకు సహాయం అందించేందుకు సాంకేతికతను కూడా అందుబాటులోకి తెచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు అశోక్,రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ వెంకటేశ్వర ఆలయంలో అన్నదానం

అల్వాల్, జూన్ 27 ప్రభాతవార్త: అల్వాల్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ పున ప్రారంభమైంది. వంట గ్యాస్ కొరత కారణంగా గత కొద్ది రోజులు అన్నదానంను దేవాదాయ శాఖ నిలిపి వేసింది. ప్రతి శనివారం భక్తులకు అన్నదానం చేయడం అనేది దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. శనివారం ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య చైర్మన్ రాజా గోపాల్ సైయించార్ అన్నదానాన్ని పున ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటుగా భకులు సురేందర్ రెడ్డి, శివ రామక్రిష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్దార్‌సింగ్, సైదులు, శ్రీనివాసులు, రామకృష్ణ

## ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

### ఎస్సీ ఎస్టీ విద్యార్థి యువజన సంఘం అధ్యక్షుడు సర్దార్‌సింగ్

**హైదరాబాద్, జూన్ 27,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్‌ను విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని ఎస్సీ,ఎస్టీ విద్యార్థి యువజన సంఘం అధ్యక్షులు సర్దార్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు సైదులు, శ్రీనివాసులు, రామకృష్ణ, సందీప్, మురళితో కలిసి మాట్లాడారు. ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో ఓవైపు విద్యార్థులతో పాటు లెక్చరర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే ఫీజుల చెల్లించలేక, సర్టిఫికెట్లు అందక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ నోటిఫికేషన్లకు విద్యార్థులు దూరమవు తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రిజర్వేషన్లలో రోస్టర్ ఉల్లంఘనలతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా బీసీ విద్యార్థుల పట్ల శాపంగా మారిన క్రిమిలేయర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆధునిక యుగంలో సైతం విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్న కుల వివక్షపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రైవేటు యూనివర్సిటీలను నియంత్రించడంతోపాటు ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే విద్యార్థి నిరుద్యోగ యువజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## 10న రెడ్డి ఉమెన్స్ కాలేజీ స్నాతకోత్సవం

**హైదరాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** రాజాబహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 15వ స్నాతకోత్సవం జూలై 10వ తేదీన నారాయణగూడ లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.ముత్యంరెడ్డి, కళాశాలసెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్‌రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి. మంజుల, వైస్ ప్రిన్సిపల్ సిందూరిలతోకలిసి ప్రిన్సిపాల్ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. 2024-25 విద్యాసంవత్సరంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన 302 మంది విద్యార్థులకు డిగ్రీసర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు. చదువులో అత్యుత్తమంగా రాణించిన 17 మంది విద్యార్థినీలకు స్వర్ణపతకాలను అందించనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవ వేడుకలకు మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ బి. సుమతి ముఖ్యఅతిధిగా పాల్గొంటారని, ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ గౌరవ అతిధిగా పాల్గొంటారని తెలిపారు.

## కూకట్‌పల్లిలో కొనసాగుతున్న 'సర్'

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 27, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి నియోజకవర్గం లో సర్(ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ విస్తృతంగా కొనసాగుతోంది. శనివారం నియోజకవర్గంలో జరుగుతున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ సర్కిల్ ఉప కమిషనర్ ఆంజనేయులు పర్యవేక్షి ంచారు. బాలాజీ నగర్‌లో బిఎల్వోలు బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్‌కు అందజేశారు. ఒక్కో ఓటర్ పేరుతో ప్రింట్ అయిన రెండు పత్రాల లో ఓటర్ వివరాలను నమోదు చేసిన అధికారులు ఓ పత్రాన్ని ఓటర్‌కు ఇవ్వగా మరో పత్రాన్ని తీసుకువచ్చి ఆ వివరాలను కంప్యూటర్‌లో అప్లోడ్ చేయనున్నారు. ఇక్కడ జరుగుతున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, ఓటరు వివరాల నమోదును డిసి స్వయంగా పరిశీలించారు. పార్టీపరంగా సర్ కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్ పార్టీ నేతలకు సలహాలు సూచనలు చేశారు. డిసి ఆంజనేయులు మాట్లాడుతూ ఓటర్ నమోదు వివరాలు అత్యంత ఖచ్చితత్వంతో కూడి ఉంటాయని ఎవరి ఓటయినా లేక పోయినా కొత్తగా నమోదు కావాలన్నా అధికారులను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ మౌనిక బిఎల్ఏ శ్రీకాంత్ ముదిరాజ్ లక్ష్మీ ‌ ్మ, ఎండీ.జంగీర్ బాలాజీనగర్ డివిజన్ వివేకనగర్ కాలనీ పార్టీ సీనియర్ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజపుత్, మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సునీల్ కుమార్, పిడికిటి గోపాల్ చౌదరి, రంగమోహన్, సుధా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు

### ఏసిపి సుధాకర్

**చాంద్రాయణగుట్ట, జూన్ 27, ప్రభాతవార్త :** విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఏసీపీ ఎ.సుధాకర్ హితవుపలికారు. శనివారం చాంద్రాయణగుట్ట అల్ జుబైల్ కాలనీలోని టిజిఎంఆర్ఎస్‌జెసిలో చదువుకుంటున్న విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ సుధాకర్ మాట్లాడుతూ ఒకసారి కేసుల్లో ఇరికితే భవిష్యత్ పూర్తిగా అంధకారమేనని, తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చ వద్దన్నారు. డ్రగ్స్, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువు, క్రీడలు, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. తమపరిసరాల్లో డ్రగ్స్ సంబంధించిన కార్యకలా పాలను గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బండ్లగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్, సబ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, పాఠశాల, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను పౌరులు సద్వినియోగం చేసుకోవాలి

**చాంద్రాయణగుట్ట, జూన్ 27, ప్రభాతవార్త :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పౌరులు సద్వినియోగంచేసుకోవాలని జీహెచ్ఎంసి చార్మినార్ అసెంబ్లీ ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ ఎల్.సరిత కోరారు. శనివారం హరిబౌలి డివిజన్ రాంబక్షిబండలోని పోలింగ్ స్టేషన్ 197 పరిధిలో పర్యటించి ఎస్ఐఆర్, ఫారం-6ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ సరిత మాట్లాడుతూ అసెంబ్లీ పరిధిలో 198 పోలింగ్ స్టేషన్లు, రెండ లక్షల 37వేల 483 మంది ఓటర్లున్నట్లు వెల్లడించారు. 198 మంది బిఎల్ఒలు, బిఎల్ఎలతో కలిసి ఇంటింటికి వెళ్ళి సర్ ఫారంలను అందజేస్తున్నట్లు వివరించారు. నలుగురు ఎఈఆర్ఓలు 50 మంది బిఎల్ఓలను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యావంతులైన ప్రతి ఒక్కరు ఆన్‌లైన్ ద్వారా సర్ ఫారంను పూర్తి చేయవచ్చన్నారు. ఇంటింటికి వచ్చే బిఎల్ఒలకు ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. బిఎల్ఓ మహేష్, శక్తికేంద్ర ఇంచార్జ్ చేతన్ కుమార్ సూరి, బిఎల్ఏ జె.శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

## పద్మారావు కుటుంబ సభ్యులకు కవిత పరామర్శ

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 27, ప్రభాతవార్త :** తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు దివంగత నేత గొట్టిముక్కల పద్మారావు కుటుంబ సభ్యులను శనివారం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కూకట్‌పల్లి ప్రాంతం నుండి గొట్టిముక్కల పద్మారావు తన వంతు కృషి చేశారని కొనియాడారు. పద్మారావు ఆకస్మిక మరణం తీరనిలోటని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వట్టిముక్కల పాండురంగారావు, కుట్టిముక్కల వెంకటేశ్వరరావు, సృజన, బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబల మహేష్ గౌడ్, మేకల సుదర్శన్, ఈ సునీల్ రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పద్మారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కవిత

# భూగర్భ నాలా పనులు వేగవంతం చేయాలి

### యుద్ధప్రాతిపాదికన కల్వర్టు నిర్మాణ పనులు
### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జూన్ 27 ప్రభాతవార్త**

వర్షాకాలం సందర్భంగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఎంఈటీ బృందాలు ఉంటాయని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం కాప్రాల్ లక్ష్మీపురి కాలనీ, ఎస్ఎస్ ఎన్ క్లేవ్, ఎంప్లాయిస్ కాలనీ, స్వాంద్ర, బాలాజీనగర్, చంద్రపురి కాలనీ ప్రాంతాల్లో అధికారులు సిబ్బంది తో కలిసి పర్యటించారు. లక్ష్మీపురి కాలనీలో కమిషనర్ పర్యటించి వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, నాలాల అనుసంధానాన్ని పరిశీలించారు.ఎంఈటీ బృందాలను సమర్థవంతంగా వినియోగిస్తూ డీసిల్టింగ్, డ్రెయిన్ల నిర్వహణ, నీటి నిల్వ నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం ఎస్ఎస్ ఎన్‌క్లేవ్‌లో నీటి నిల్వ ప్రాంతాలు, నాలాల అనుసంధానం, స్టార్మ్ వాటర్ డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. స్థానికుల సమస్యలను విని, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాలాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడం, క్రమం తప్పకుండా డీసిల్టింగ్ నిర్వహించడం, అవసరమైన చోట అదనపు క్యాచ్ పిట్లు ఏర్పాటు చేయడం, డ్రెయినేజీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం ద్వారా వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని సూచించారు. అనంతరం ఎంప్లాయిస్ కాలనీలో నీటి నిల్వ ప్రాంతాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, భూగర్భ నాలా కనెక్టివిటీ పనులను పరిశీలించారు. భూగర్భ నాలాను ప్రస్తుతం ఉన్న ఓపెన్ నాలాతో అనుసంధానించే పనులను వేగవంతం చేసి భారీ వర్షాలు ప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్టార్మ్ వాటర్ డ్రెయినేజీ వ్యవస్థను కూడా పరిశీలించి నీటి నిల్వలు లేకుండా సరైన డ్రెయినేజీ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో ఖాళీ స్థలంలోని చెత్తను తొలగించి స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అక్రమంగా చెత్త వేస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్వాంద్ర ప్రాంతంలో,బాలాజీనగర్ మెయిన్ రోడ్డు,చంద్రపురి కాలనీలను కమిషనర్ పర్యటించి స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, నాలా కనెక్టివిటీ, డ్రెయినేజీ డైవర్షన్ పనులను సమీక్షించారు. వర్షాకాలం మొత్తం హైడ్రా, ఎంఈటీ బృందాలు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లలో క్రమం తప్పకుండా డీసిల్టింగ్ నిర్వహించి ఎలాంటి అడ్డంకులు లేకుండా వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మల్కారం చెరువు నుంచి లీచేట్ పాండ్ వరకు సరైన గ్రేడియెంట్, లెవెల్ ఉండేలా పనులు చేపట్టి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని సూచించారు.


నాలా పనులను పరిశీలిస్తున్న వినయ్ కృష్ణారెడ్డి


చర్చా కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

## ఐఎంటి హైదరాబాద్‌లో ముగిసిన అభ్యుదయ -2026

**హైదరాబాద్, 27 జూన్ ప్రభాతవార్త:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(ఐఎంటి), హైదరాబాద్ మేనేజ్‌మెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్, అభ్యుదయ 2026 ఘనంగా ముగిసింది. మేనేజ్‌మెంట్ విద్యార్థుల నుండి పరిశ్రమ అంచనాలు మీ బిస్కూల్ ప్రయాణాన్ని అత్యుత్తమంగా మలచుకోవడం' అనే ఇతివృత్తంతో జరిగిన ముగింపు ప్యానెల్ చర్చా కార్యక్రమంతో ముగించింది. ప్రకాష్ పాఠక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్చ కార్యక్రమంలో ఈ చర్చా కార్యక్రమంలో అనుకుల్య పాండా, నవీన్ రాజ్‌డేఎ ఐషిక్ భట్టాచార్య, వినీత్ శుకా ఏఎంఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ పునియాతో సహా పలువురు ప్రముఖ పరిశ్రమ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్పొరేట్ ప్రపంచంలో విజయం సాధించడానికి అవసరమైన పటిష్టమైన పునాదులు, నిరంతర అభ్యాసం, ఏఐ బాధ్యతాయుతమైన వినియోగం, అనుకూలత కీలక ప్రాముఖ్యతను ఈ సమావేశం లోతుగా పరిశీలించింది. తక్షణ ప్రతిఫలం కంటే అభ్యాసానికి, సంస్థాగత అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వాలని సునీల్ పునియా విద్యార్థులను ప్రోత్సహించారు. ఏఐని ఒక ప్రత్యామ్నాయంగా కాకుండా, ఒక సాధికారిక సాధనంగా చూడాలన్నారు. వ్యాపారాన్ని అర్థం చేసుకోవడానికి, పటిష్టమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, వినియోగదారుకేంద్రీకృత మనస్తత్వాన్ని నిర్మించుకోవడానికి అమ్మకాలను ఒక కీలకమైన పునాదిగా చూడాలని ఐషిక్ భట్టాచార్య చెప్పారు.

## బిఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

### ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ విషయంలో బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో బీఆర్ఎస్ బూత్ లెవల్ కార్యకర్తలు, నాయకులకు సర్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ సర్వే విభాగం అధికారి అమరసింహారెడ్డి హాజరై, సర్‌పై అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అడిగిన ప్రశ్నలకు సమాధాలు ఇచ్చి, వారి అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఐఆర్ నిర్వహించిన సందర్భంగా పలు రాష్ట్రాలలో ఓట్లు గల్లంతయ్యాయని, రాష్ట్రంలోనూ గల్లంతయ్యే ప్రమాదం ఉంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదయ్యే విధంగా జాగ్రత్త వహించాలన్నారు. ఓట్ల తొలగింపును బీఆర్ఎస్ కార్యకర్తలు నిశితంగా పరిశీలించాలని, అర్హు లైనవారిని తొలగిస్తే అభ్యంతరం తెలపాలని, అనుమానంవస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నియోజకవర్గంలోని 274 పోలింగ్ బూత్‌ల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీఎల్ఓలతో కలసి వెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండే విధంగా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ బూత్‌లెవల్ సిబ్బందికి ఎన్యూమరేషన్ దరఖాస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, కే.మాధవ్, శ్రీనివాస్‌గుప్తా, వి.సుధాకర్‌గుప్తా, ముఠా నరేష్, వల్లాల శ్రీనివాస్, ఆకుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌టియులో చేరిన టిటియుసి నాయకులు

**చిక్కడపల్లి, జూన్ 27 (ప్రభాతవార్త):**

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని బిఆర్ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి భారత రాష్ట్ర ట్రేడ్‌యూనియన్(బీఆర్టీయూ) రాష్ట్ర కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు మోతే శోభన రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న టీటీయూసీ (కె బంగాణ ట్రేడ్ యూనియన్ సెల్) నుంచి కార్మిక నాయకులు బీఆర్టీయూలో చేరారు. బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ మోతే శోభనెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదని బీఆర్టీయూలో చేరిన నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీటీయూసీ సంఘాన్ని ప్రోత్సహించారని తెలిపారు.కానీ శోభన్‌రెడ్డి బీఆర్ఎస్‌నువీడి కాంగ్రెస్‌లో చేరారని మండిపడ్డారు. బీఆర్టీయూలో చేరిన వారిలో టీజీ యూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవానంద్, నగర అధ్యక్షుడు రామగిరి పరమేష్, రాష్ట్ర కార్యదర్శి రాజన్న, నగర ఉపాధ్యక్షుడు రామగిరి హరి బాబు దేవానంద్, నగర కార్యదర్శి రాజేశ్, సంయుక్త కార్యదర్శి రాజుయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్రావు, నాయకులు గణేశ్, ప్రణీత్, అనిల్, సాయిసూర్య, రాజు, లాల రామన్న ఉన్నారు.



మాట్లాడుతున్న కృష్ణయాదవ్

## జర్నలిస్టులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

### గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం అధ్యక్షుడు కృష్ణయాదవ్

**హైదరాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** రాష్ట్రసాధనలో కీలకపాత్ర పోషించిన తెలంగాణ ప్రాంత జర్నలిస్టులకు ప్రభుత్వం న్యాయం చేయాలని గ్రేటర్ హైదరాబాద్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం అధ్యక్షుడు ఎం.బి.కృష్ణయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గం టి జేఏసీ కన్వీనర్ రూబీ స్టీవెన్సన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన అంబర్‌పేట వర్కింగ్ జర్నలిస్టులకు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉద్యమం క్రమంలో ప్రజలను ఎప్పటికప్పుడు జాగృతం చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులతోపాటు ఉద్యమంలో ప్రధానపాత్ర పోషించిన జర్నలిస్టులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం 250 గజాల స్థలం, రూ. 25 వేల పెన్షన్ హెల్త్‌కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 1969 తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు సుధాకర్, గ్రేటర్ టిఎన్జీవో సంఘం మాజీ నాయకు రాలు తన్వీర సుల్తానా, టీజేఏసీనాయకులు పిండిగ వెంకన్న, వర్కాల శ్రీకాంత్, శశిధర్, శిల్పి జహంగీర్, సూర్యవంశీ జాన్,వంజరి రవీందర్, భాను దాస్, శివకుమార్, అంబర్‌పేటనియోజకవర్గం సీనియర్ జర్నలిస్టులు డి.లక్ష్మన్, సతీష్‌ముదిరాజ్, మహేందర్, దాసరి తిరుమలేష్,వర్కాల కృష్ణ, సురేష్,రామన్‌రాజ్, రమేష్, పురుషోత్తం, అమరేందర్ గౌడ్,చింత స్వామి, సద్దాం హుస్సేన్, శ్రీను, బబ్లు, హర్ష, తదితరులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

## దివ్యాంగుల హక్కుల సాధనకు హెలెన్ కెల్లర్ స్ఫూర్తి

### కొల్లి నాగేశ్వరరావు

**చిక్కడపల్లి, జూన్ 27 (ప్రభాతవార్త):** చూపు, వినికిడిలోపాలు ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది దివ్యాంగులకు హెలెన్ కెల్లర్ గొప్ప స్ఫూర్తిగా నిలిచారని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని వేదిక కార్యాలయంలో ప్రపంచ ప్రఖ్యాత దివ్యాంగుల హక్కుల పోరాట యోధురాలు, సంఘ సంస్కర్త హెలెన్ కెల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆత్మవిశ్వాసం, విద్య, పట్టుదలతో జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని హెలెన్ కెల్లర్ తన జీవితం ద్వారా నిరూపించారని పేర్కొన్నారు.హెలెన్ కెల్లర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దివ్యాంగుల సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక గ్రేటర్ అధ్యక్షులు జంగిల్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పంది శ్రీనివాస్, సంఘం నాయకులు బండారి మనోజ్, మహ్మద్ అలీ, మహమ్మద్ కలీమ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## భక్తి సంగీతంతో అలరించిన నంద గోకులం భజన్

**చిక్కడపల్లి, జూన్ 27 (ప్రభాతవార్త) :** చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో ప్రముఖ సంగీత విద్వాంసులు యర్రగొల్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నందగోకులం భజన్ జామింగ్స్ కార్యక్రమం శనివారం భక్తిపారవశ్యంతో జరిగింది. శ్రీకృష్ణునిపై అంకితమైన భజనలు, కీర్తనలు, ఆధ్యాత్మిక సంగీత విభావరితో సభికులను సంగీతానందంలో ముంచెత్తాయి. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్ తనబృందంతో కలిసి ఆలపించిన భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుని మహిమను కీర్తిస్తూసాగిన గానామృతం సభలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. భక్తులు ఉత్సాహంగా పాల్గొని భజనలకు చప్పట్లతో అభినందనలు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు, సంగీతాభిమానులు కార్యక్రమాన్ని ఆస్వాదించి నిర్వాహకులను అభినందించారు. భక్తి సంగీతాన్ని ప్రజల్లో మరింత విస్తరించే లక్ష ్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని వై. శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

## యోగాతో ఆరోగ్యం : చంద్రారెడ్డి

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 27, ప్రభాతవార్త :** ఉరుకుల పరుగుల యాంత్రిక జీవితంలో యోగాకు కొంత సమయం కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పాపిరెడీనాగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. బస్తీలోని శ్రీశ్రీ వీరంజనేయ శివాలయం కమిటీ హాల్లో శనివారం నుంచి యోగ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఉదయం 5.30 నిమిషాల నుంచి 7.00 గంటల వరకు ఉచిత యోగ శిక్షణ ఉంటుందని చంద్రారెడ్డి తెలిపారు. యోగ గురువు సుదేర్శన్, నరసింహులు, తాటి కిరణ్, తిరుపతి రెడ్డి, వనం అంజనేయులు, పి శంకర్ రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలి

**సైఫాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు నమోదుచేయాలని, కుటుంబాల మ్యాపింగ్ లో లేని ఓటర్లను సమగ్రంగా పరిగణలోకి తీసుకోవాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.ఆధారాలులేని అస్పష్టతలుగలవారిని గ్రామ సభలు, బస్తీసభల ద్వారా ధృవీకరించాలని, ప్రభుత్వం విడుదల చేసిన గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పాస్‌పోర్ట్‌ను విధిగా గుర్తించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకుడు జే.వి.చలపతిరావు, ఆర్ఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు జానికి రాములు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు హేమా జిల్లోజుల, ఎంసిఐ(యు) నాయకుడు ఉపేందర్‌రెడ్డి, ప్రసాదన్న తదితరులు



మాట్లాడుతున్న వినాయక్‌రెడ్డి

మాట్లాడుతూ తెలంగాణలో రాబోయే ఎన్నికల వరకు నిరవధికంగా ఓటరునమోదు కార్యక్రమాన్ని కొనసాగించాలని, ఓటరు కార్డు పౌరసత్వానికి ముడిపెట్టరాదని, సామాజిక కార్యకర్తలను ఓటరు నమోదు కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కోరారు. రాష్ట్రంలో సర్ పేరుతో సుమారు ఒకకోటి మంది ఓటర్లను తొలగించే ప్రయత్నం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్నదని ఆరోపించారు. ముస్లింలు, క్రైస్తవులు, ఎస్సీలు,ఆదివాసీలు పేదల ఓట్లను తొలగిం చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని, సర్‌కు వ్యతి రేకంగా ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలు, వ్యక్తులు, మేధా వులు ఉండరాదని, అంతిమంగా దేశంలో రాజ్యాం గాన్ని రద్దు చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇక ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్నదని, దీన్ని ప్రజలకుకాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు.


రకరకాల పండ్లతో అలంకరించిన గోల్డెన్ టెంపుల్ విగ్రహాలు

## ఘనంగా "పానిహతి చిడా దహి" వేడుకలు

**బంజారాహిల్స్, జూన్ 27 (ప్రభాతవార్త):** నగరంలోని బంజారాహిల్స్ లోని హారేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో అటుకులు పెరుగు ప్రసాదం సమర్పించే సాంప్రదాయ పండుగ "పానిహతి చిడా దహి" వేడుకను హరేకృష్ణ మూవ్ మెంట్ ఘనంగా నిర్వహించింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి జంటనగరాల నలుమూలలనుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని భగవంతుడి ఆశీస్సులందుకున్నారు. జ్యేష్ఠమాసంలో శుక్లపక్ష త్రయోదశినాడు నిర్వహించేచిడా దహి వేడుకను దండ మహోత్సవం అని కూడా పిలుస్తారు. నిత్యానంద ప్రభుత్వ, శ్రీలరఘునాథ దాస గోస్వామిల అద్భుతమైన లీలలను స్మరించుకునే ఒక ఆనందకరమైన వార్షిక వేడుక అని నిర్వాహకులు వెల్లడించారు. భగవంతుడు తన భక్తులకు పెరుగు, అటుకులుఇతర అమృత తుల్యమైన ఆహార పదార్థాలతో విందు ఏర్పాటుచేసి వారిపట్ల తన కరుణను చూపించడమే ఈ వేడుక ప్రధాన అంతరార్థమని వెల్లడించారు. సాయంత్రం నితాయ్ గౌరాంగ దివ్యపల్లికిసేవ, హరినామ సంకీర్తనలతో ప్రారంభం అయ్యాయి. వేదమంత్రాలమధ్య పంచామృతాలు, పంచగవ్యం, పండ్ల రసాలు, రంగురంగులపుష్పాలు, ప్రత్యేక ఔషధాలు, నవరత్నాలు, ఇతర పవిత్రమైన ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్ మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభుజీ మాట్లాడుతూ సానిహతి చిడా దహి అనేది భగవంతుడనికి అత్యంత ప్రియమైన భక్తులకు సేవచేయడం ద్వారా ఆయన ఆశీస్సులు పొందేఉత్తమ మార్గం అని అన్నారు. 510ఏళ్లక్రితం పశ్చిమబెంగాల్‌లోని పానిహతిలో అటుకులు, పెరుగు,పాలు పండ్లతోకూడిన రుచికరమైన ప్రసాదం భగవంతునికి సమర్పించి తొలిసారిగా ఈవేడుక నిర్వహించినట్లు సత్యగౌర చంద్రదాస ప్రభుజీ చెప్పారు.

## నిమ్స్‌కు ఇఎల్ఎస్ అంబులెన్స్ వితరణ

**జూబ్లీహిల్స్, జూన్ 27, ప్రభాతవార్త :** బంట్వాల్ లక్ష్మణ్ షెనోయ్, శాంత షెనోయ్ దంపతుల స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు శనివారం నిమ్స్ ఆసుపత్రికి బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్) అంబులెన్స్‌ను విరాళంగా అందించారు. షెనోయ్ కుటుంబసభ్యులైన ప్రకాశ్ షెనోయ్, ఉషా మాల్యా, అనీషాషెనోయ్, డాక్టర్ ప్రజ్ఞా రంగనాథ్‌లు రూ. 30లక్షల విలువైన ఈ అంబులెన్స్‌ను నిమ్స్ డైరక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌కు విరాళంగా అం దించారు. నిమ్స్‌లో అత్యవసర సేవలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ అంబులెన్స్‌ను అందించినట్లు దాతలు వెల్లడించారు. ఈ సందర్భంగా దాతలకు డైరక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పరంజ్యోతి, సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రంగనాథ్, మెడికల్ జెనె టిక్స్ విభాగాధిపతి డాక్టర్ ప్రజ్ఞారంగనాథ్, అసిస్టెంట్ మెడికల్ సూపరిం టెండెంట్లు డాక్టర్ రాకేష్, డాక్టర్ చరణ్, మీడియా రిలేషన్స్ అధికారి సత్య గౌడ్, షెనోయ్ కుటుంబసభ్యులు, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HONOURABLE I Addl JUNIOR CIVIL JUDGE-CUM-VIII Addl JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT:MEDCHAL**
**O. S. No 158 of 2026**
**Between:**
Parimi Muralidhar
**...Plaintiff**
**AND**
1) The Mandal Revenue Officer, Quthbullapur Mandal, Medchal-Malkajigiri District.
2) All Concerned
**...Defendants**
To
All concerned
Please take notice that the above suit is filed by the Plaintiff against the Defendants Parimi Muralidhar to declare them as legal heir of Late K.Sneha and the said suit is posted on 13-7-2026 for your appearance and counter, if any therefore your hereby called upon to appear either in person or through an advocate in the above suit before the above said court on 13-7-2026 at 10:30 AM failing which the suit will be decided on the merits in your absence.
**(By order of the Hon'ble Court)**
**M/s. AB Reddy Law Associates**
**A. Bhaskar Reddy**
**B.com, L.L.B., (Advocated)**
#Flat: 204, Maha Sai Plaza, Kailash Hills Main Road, Mahadevapura, Hyderabad-500055.
**Cell No. 8179555150.**

**IN THE COURT OF THE HON'BLE XVII ADDL. SENIOR CIVIL COURT, CITY CIVIL COURT, AT HYDERABAD**
**E.P.No. 272 of 2025**
**In**
**O.S.No. 222 of 2018**
**BETWEEN:**
Ch.Madhusudhan
**...Decree Holder**
**AND**
G.Hanumanth Rao and others
**...Judgement Debtors**
To,
G.Hanumanth Rao, S/o. G.V.Rasaiah, Aged about 62 years, Occ: Retired Employee, R/o. 12-1-331/29, Datheriya Colony, Hyderabad -500028.
**...J.Dr.No.1**
Please take notice that my client/D.Hrhas filed the above EP against you for recovery of Rs.13,38,105=33 plus accrued interest. That, by the order of the Hon'ble Court dated:-22-06-2026, it is informed to you that the above case stands posted to 17-07-2026 for your appearance and you are required to appear either in person or through Counsel before the Hon'ble Court on 17-07-2026 at 10:30 A.M.,
Please learn that if none appears on your behalf, the Hon'ble court will hear the matter and decide it, ex-parte in your absence.
Hence, this notice as per direction of Hon'ble Court."
**ABHISHEK SINGH**
**ADVOCATE**
#111, Renuka Shakti Apartment, Opp.Bharatiya Vidya Bhavan, King Koti Road, Hyderabad- 500029
**Phone No. 9491368837**

**IN THE HON'BLE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT HAYATHNAGAR**
**O.S. No.966 OF 2024**
**Between:**
State Bank of India, Hasthinapuram Branch, Ranga Reddy
**...Plaintiff**
**And**
Abigail Govada
**...Defendant**
To
Abigail Govada D/o G. Bharathbhushan, Aged about 29 years, Occ: Employee, H.No.12-7-147/3, Mettuguda, Near Ayyappa Temple, Hyderabad - 500 017.
Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 09-07-2026 in the above mentioned Court or else the matter will be determined based on the available material without any further notice to you as ordered by the Court.
**SMT. RAPAKA ARUNA,**
B.A, B.L.,
Advocate
# 11-41/4, Pragathinagar, Gaddiannaram, Hyderabad-500 060.

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
GHMC
టెండర్ ప్రకటన 'ఇ' నిట్ నం.లు : 01/02/03/SI/IT/GHMC/2026-27, తేది: 25.05.2026, 27.06.2026, 27.06.2026,. పనిపేరు: (1) సంవత్సరం యొక్క రేట్ కాంట్రాక్ట్ కాలానికి, GHMC, హెడ్ ఆఫీస్ యొక్క వివిధ సెక్షన్‌కు ప్రింటర్‌లు, మల్టీ-ఫంక్షనల్ కలర్ ప్రింటర్స్ మరియు కాపియర్ మెషీన్స్‌కు కార్ట్రిడ్జ్‌లు యొక్క సరఫరా. (2) (6) నెలలు కొరకు రేట్ కాంట్రాక్ట్-GHMC, హెడ్ ఆఫీస్‌కు ల్యాప్‌టాప్‌ల సరఫరా మరియు అందజేత, డెస్క్ టాప్‌లు, ప్రింటర్‌లు, స్కానర్‌లు మరియు కాపియర్ మెషీన్‌లు (1వ రీకాల్) (3),(1) సంవత్సరం యొక్క కాలానికి GHMC, HO, IT సెక్షన్‌లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికపై (25)నం.ల IT ఉద్యోగుల యొక్క సేవల ఏర్పాటు. కోట్స్ దాఖలుకు ప్రారంభ తేదీ/చివరి తేదీ మరియు సమయం: 1, 2 ప్రారంభ తేది: 26.05.2026 ఉ.11.00 ముగింపు తేది: 01.07.2026 సా.04.00గం. (3) ప్రారంభ తేది: 26.05.2026 ఉ.11.00గం. ముగింపు తేది: 06.07.2026 సా.04.00గం. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నం: 1,2,3: అడిషనల్ కమిషనర్ యొక్క కార్యాలయం, (IT), 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ బిల్డింగ్, GHMC, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్ 500063. ఫోన్: 6309999458/9963551523, deeit-ghmc@gov.in.
సం/-, అడిషనల్ కమిషనర్, (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), GHMC.
**DIPR.NO. 5051-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 27.06.2026**

## గుంతలతో ప్రమాదకరంగా రోడ్డు



**హయత్ నగర్, జూన్ 27 ప్రభాతవార్త :**
ఎక్కడైనా అభివృద్ధి పనులు పూర్తయితే అక్కడి ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నది వాస్తవం. కానీ నాగోల్ సర్కిల్ పెద్ద అంబర్ పేట డివిజన్ విగ్నేశ్వర్ కాలనీలో నూతనంగా వేసిన సీసీ రోడ్డుతో సమస్య పరిష్కారం కాకపోగా... ప్రజల కష్టాలు రెట్టింపయ్యాయి. ఇటీవల వేసిన సీసీ రోడ్డులో నాణ్యత లేకపోవడంతో గుంతల మయంగా మారింది. కంకర తేలి పాదచారులు, ద్విచక్ర వాహన దారుల పాలిట ప్రమాదకరంగా మారింది. కాంట్రాక్టర్ అవినీతికి క్షేత్ర స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపాలు తోడవడంతో ఇలాంటి పరిస్థితి తలెత్తుతోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు కాంట్రాకర్ మీద చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం.. ఇంటింటికీ చేరిన రాజ్యలక్ష్మి



**నేరేడ్ మెట్ జూన్ 27 ,ప్రభాతవార్త :**
ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు కొనసాగేందుకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి శుక్రవారం ఇంటింటికీ పర్యటించి ఓటర్ల వివరాలను పరిశీలించారు. కాకతీయ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, వినోభా నగర్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలు 239, 240, 241 పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరికి అవగాహన కల్పిస్తూ, ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని వివరించారు. అర్హత ఉన్న ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ప్రజలకు వివరించి, తమ వివరాలను సకాలంలో ధ్రువీకరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్ఏ అధికారి తిరుమలదేవి, బీజేపీ నాయకులు మల్లేష్, సాయి సురేష్, సుమలత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిపై అసత్య ప్రచారానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### డిసిపికి ఫిర్యాదు



**నేరేడ్ మెట్ , జూన్ 27 ప్రభాతవార్త :**
మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు పై సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ వేదికల ద్వారా అసత్య ప్రచారం నిర్వహిస్తున్న కొందరు వ్యక్తులు, ఫేక్ యూట్యూబ్ ఛానెళ్ల నిర్వాహకులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మల్కాజిగిరి డీసీపీకి, నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ సీఐకి ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదులో మైనంపల్లి హనుమంత రావు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు, తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి చర్యలు వ్యక్తిగత పరువుకు నష్టం కలిగించడమే కాకుండా ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సంబంధిత యూట్యూబ్ ఛానెళ్లు, వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు పిర్యాదుదారులు తెలిపారు.

## ఫల్స్‌పోలియో విజయవంతం చేయండి : డా.సౌశిల్యరాణి



ఉప్పల్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. సౌశిల్యరాణి

**ఉప్పల్, జూన్ 27 ప్రభాతవార్త :**
ఉప్పల్ ఆరోగ్య కేంద్రం పరిదిలో ఆది వారం నిర్వహించే ప ల్స్ పోలియో కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సౌశిస్యరాణి కోరారు. ఈ మేరకు శనివా రం ఆమె మాట్లాడు తూ జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం 7 గంటల నుండి సాయం త్రం 5 గంటల వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించబడు తుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నవజాత శిశువుల నుండి 5 సంవత్స రాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిల్లలకు సాధారణ టీకాల కార్యక్రమం ద్వారా అన్ని టీకాలు పూర్తిగా వేసినప్పటికీ, పల్స్ పోలియో కార్యక్ర మంలో ఇచ్చే అదనపు పోలియో చుక్కలు కూడా తప్పనిసరిగా వేయించాలని సూచించారు. అన్ని ప్రాంజమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు మెట్రో స్టేషన్లు, బస్ స్టాండ్లు మరియు ఇతర ఏర్పాటు చేసిన పల్స్ పోలి యో కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని పోలియో కేంద్రానికి తీసుకువెళ్లి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆమె కోరారు.

## బాలాపూర్‌లో ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవం

### -హాజరైన గ్రామ పెద్దలు, ప్రముఖులు



బొడ్రాయి ప్రతిష్టాపనోత్స వాల్లో పూజలు చేసిన బాలాపూర్ గ్రామ పెద్దలు, మాజీ పోలీస్ పటేల్ సామల రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



ప్రతిష్టాపనోత్స వాలకు హాజరైన పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 27 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బాలాపూర్ గ్రామంలో శ్రీ శీతలా బొడ్రాయి (నాభి శిలా) ప్రతిష్టాపనోత్స వం కనుల పండువగా జరిగింది. గ్రామస్తులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత గురువారం నుండి శాస్త్రోక్తంగా నియమ నిష్ఠలతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మహోత్స వంలో భాగంగా కీలకమైన ప్రతిష్టాపన ఘట్టం శనివారం జరిగింది. ప్రతిష్టా పురోహితుడు బ్రహ్మశ్రీ రేవల్లి రాజు శర్మ, పురోహితుడు సభాపతి నరహరి శర్మ, బైండ్ల పూజారులు ఇంద్రపల్లి ముత్యాలు, ఏదుల్ల గౌరీ శంకర్‌లు గ్రామస్తుల సమక్షంలో బొడ్రాయి ప్రతిష్టను జరిపారు. ప్రాతః కాల పూజల అనంతరం బొడ్రాయి యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట చేశారు. నిర్వాహక కమిటీ ముఖ్యుడు కళ్లెం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్టాపనోత్స వ పూజల్లో బాలాపూర్‌కు చెందిన గ్రామ పెద్దలు, మాజీ పోలీస్ పటేల్ సామల రంగారెడ్డి, సింగిరెడ్డి జైహింద్‌రెడ్డి, సింగిరెడ్డి పెంటారెడ్డి, చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, యెల్మేటి అమరేందర్‌రెడ్డి, కొలన్ శంకర్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర జైహింద్‌కుమార్, గుండోజు రఘు నందనాచారి, బండారి మనోహర్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వెంకటేష్, మేకల సంజీవ, రావుల మల్లేష్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, గిర్కట్టి కృష్ణంరాజుగౌడ్, జోరల ప్రభాకర్, గురవని శ్రీకాంత్‌లతో పాటు గ్రామ ముఖ్యులు, నాయకులు, గ్రామస్తులందరూ పాల్గొన్నారు.

**బొడ్రాయి పండుగకు హాజరైన ప్రముఖులు**

కాగా ప్రతిష్టాత్మకంగా జరిగిన బాలాపూర్ బొడ్రాయి ప్రతిష్టాపనోత్స వానికి చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఛైర్మన్ సరిత తిరుపతయ్య, రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లతో పాటు పలువురు హాజరయ్యారు. ప్రతిష్ట, పూజల అనంతరం వీరందరినీ బొడ్రాయి కమిటీ వారు ఘనంగా సన్మానించారు.

## దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



హెలెన్ కెల్లర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ మూత్తినేని వీరయ్య, మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి అనిత రామచంద్రన్ ,డైరెక్టర్ శైలజ తదితరులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు లాప్టాప్ లు, సెల్ ఫోన్లు అందజేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చిత్రంలో వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ మూత్తినేని వీరయ్య, మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి అనిత రామచంద్రన్ ,డైరెక్టర్ శైలజ తదితరులు

**మలక్ పేట, జూన్ 27, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన 146వ హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలకు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యి హెలెన్ కెల్లర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌మాట్లాడుతూ తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన వికలాంగులకు మొదటి ప్రాధాన్యతగా భావించి కేటాయిస్తామని తెలిపారు. హెలెన్ కెల్లర్ చిన్న వయసులోనే చూపుతో పాటు వినికిడి కోల్పోయినప్పటికీ ఆధైర్యపడకుండా 35 దేశాలు పర్యటించి దివ్యాంగుల హక్కులకోసం చైతన్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అనేక అంశాలపై 14 పుస్తకాలు, వేలాది వ్యాసాలు రచించిన హెలెన్ కెల్లర్ దివ్యాంగుల పక్షపాతిగాగానే కాకుండా జీవితాంతం కార్మిక హక్కులు, మహిళా హక్కులతో పాటు ప్రపంచ శాంతి కోసం కృషి చేశారని ప్రశంసించారు. ఆమె జీవితాన్ని ప్రతి దివ్యాంగుడు ప్రేరణగా తీసుకోవాలన్నారు. వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగుల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లాప్టాప్ లు, సెల్ ఫోన్లను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ మూతినేని వీరయ్య, మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి అనిత రామచంద్రన్.డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సూత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం: విజయలక్ష్మి

### -200 మంది పార్టీలో చేరిక



**నేరేడ్ మేట్, జూన్ 27 ప్రభాతవార్త :**
తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన పాంచజన్య సూత్రాలే పార్టీ కార్యాచరణకు దిక్సూచిగా నిలుస్తాయని, వాటిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ నాయకురాలు పిట్ల విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని నేరేడ్మెట్ చౌరస్తాలో శనివారం తెలంగాణ రక్షణ సేన జెండా పండుగను ఆమె ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన పిట్ల విజయలక్ష్మి, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం, యువతకు ఉపాధి కల్పన, మహిళా సాధికారతకు ప్రాధాన్యత కల్పించడం వంటి పాంచజన్య సూత్రాల ఆధారంగానే పార్టీ ముందుకు సాగుతోందని వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన లక్ష్యమని, తెలంగాణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తామని ఆమె పేర్కొన్నారు. పార్టీ ఆశయాలను గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని సూచించారు. అనంతరం పిట్ల విజయలక్ష్మి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 200 మంది నాయకులు, యువకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొత్తగా చేరిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలకు భోజనాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి, కుల శ్రీనివాస్, మేక లలిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో రూ.1.14 కోట్ల అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



రామంతాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్,జూన్ 27 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ పరిధిలో రూ.1.14 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పలువురు పార్టీ నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ముందుకు సాగుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఉప్పల్ నియోజకవర్గానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రతి కాలనీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్స్ తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం కౌన్సిల్‌లో నిరంతరం గళం విప్పి పోరాడి అనేక అభివృద్ధి పనులకు నిధులు సాధించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా రామంతాపూర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరానగర్‌లో రూ.80 లక్షల వ్యయంతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, భరత్‌నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో షెడ్ నిర్మాణం, భవానీనగర్‌లో రూ.14 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సర్వ బాబు యాదవ్, బోసాని పవన్, సూరం శంకర్, సర్వ ఆనంద్, శంకర్, చాంద్‌పాషా, బీజేపీ నాయకులు సంతోష్ గుప్తా, డి.కామేశ్వరరావు, వీణ, శీలం సుధ పాల్గొన్నారు.

## లార్డ్స్ పాఠశాలలో విద్యార్థి క్యాబినెట్ ఎన్నికలు



విద్యార్థి క్యాబినెట్ ఎన్నికల్లో ఓటు వేసిన విద్యార్థులు

**సరూర్‌నగర్, జూన్ 27 ప్రభాతవార్త:** జిల్లెలగూడలోని లార్డ్స్ పాఠశాలలో శనివారం విద్యార్థి క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించారు. లార్డ్స్ గ్రూపు పాఠశాలల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత ఆధ్వర్యంలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించి ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పద్ధతిలో విద్యార్థి నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బాధ్యతాయుతమైన నాయకత్వం, విలువలు, మంచి లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మరియన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అన్నా-అక్కా మెంటర్ షిప్ కార్యక్రమం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

**సరూర్‌నగర్, జూన్ 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం అన్నా-అక్కా మెంటర్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా విద్యారుథలకు డిజిటల్ విద్య, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్, కెరీర్ నైపుణ్యాలు తదితర అంశాలపై వక్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, ఏఐ కో-ఆర్టినేటర్లు నర్సింహరాజ్, నర్సింహ, డాక్టర్ కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ వెంకట్‌రెడ్డి, కెరీర్ గైడెన్స్ ఇంఛార్జి డాక్టర్ జ్యోతి తదితరులతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిషప్‌గా గోన ఫిలిప్ బాధ్యతలు స్వీకరణ



బిషప్‌గా బాధ్యతలు స్వీకరించిన గోన ఫిలిప్‌ను సత్కరిస్తున్న సంఘం నేతలు

**ఉప్పల్, జూన్ 27 ప్రభాతవార్త :**
ఉప్పల్ కిస్టియన్ మైనార్టీ సెల్ నేత గోన ఫిలిఫ్ బిషప్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శనివారం హోలిస్పిరిట్ దిజయోలాజికల్ యూనివర్సిటీ బృందం వారిచే, రెవ గోన అనిల్‌కు దిజయోలాజికల్ మాస్టర్ డిగ్రీ ప్రదానం చేశారు. ఉప్పల్ స్వరూప్ నగర్‌లోని హోరేబ్ మినిస్ట్రీస్ శనివారం జరిగిన క్రైస్తవ బిషప్ పట్టాభిషేక ప్రార్థన మహోత్స వంలో ఉప్పల్ చెందిన రెవ, డా గోన పిలిఫ్, పలువురు క్రైస్తవ ప్రముఖుల సమక్షంలో బిషప్‌గా అబిషేకింబడినారు. ఈ కార్యక్రమంలో బిషప్ జాషువా బైబిల్ వాక్యం, బిషప్ ధనరాజ్ కోట అబిషేక ప్రార్థన, బిషప్ భాస్కర్ రెడ్డి బిషప్ వస్త్రధారణ, బిషప్ సంజయ్ కిరీటీ దారణ, బిషప్ ఆనంద్ పట్టా సర్టిఫికెట్ బహాకరణ, బిషప్ వీరాజీ ఇశ్రాయేల్ మెమొంటో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

## బీరప్పగడ్డలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ



బీరప్పగడ్డలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఛైర్మన్ దీపక్ జాన్, కాంగ్రెస్ నేత ఇర్షద్ ఖాన్ తదితరులు

**ఉప్పల్, జూన్ 27 ప్రభాతవార్త** : ఉప్పల్ బీరప్పగడ్డలో రక్షణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఛైర్మన్ దీపక్ జాన్, కాంగ్రెస్ సీనియర్ నేత ఇర్షద్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎంతో అవసరమన్నారు. కుట్టు మిషన్, టైలరింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగ్ తయారీ వంటి శిక్షణలు మహిళలను స్వయం ఉపాధి దిశగా నడిపిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి మహిళ స్వావలంబన సాధించి కుటుంబానికి అండగా నిలువాలని కోరారు. మహిళల సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు..ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు బిషప్ గోన ఫిలిప్, పాస్టర్ బీసీకే దేవదానం, పాస్టర్ గోనా నతానియేల్, పాస్టర్ జేసీ బాబు, పాస్టర్ ఎస్. యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌కు ప్రజలు సహకరించాలి: బడంగ్‌పేట్ డిసి సమ్మయ్య



బిఎల్ఓలకు దిశా నిర్దేశనం చేస్తున్న బడంగ్‌పేట్ డిసి సమ్మయ్య

**సరూర్‌నగర్, జూన్ 27 ప్రభాతవార్త:**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని బడంగ్‌పేట్ డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య కోరారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి ఇంటింటి సర్వే ప్రారంభమైన నేపథ్యంలో శనివారం ఆయన జిల్లెలగూడ పరిధిలోని 174, 176, 178, 159 పోలింగ్ స్టేషన్ ప్రాంతాల్లో బిఎల్ఓ సూపర్‌వైజర్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలన జరిపారు. ఈ మేరకు ఆయన సమీక్ష జరిపి బిఎల్ఓలకు అవసరమైన సూచనలు చేస్తూ దిశా నిర్దేశనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అర్హులైన ఓటర్లు తమ వివరాలను సరి చూసుకొని ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి సంబంధిత బిఎల్ఓలకు సమర్పించాలని సూచించారు. పేరు మార్పులు, చిరునామా సవరణలు, అనర్హుల తొలగింపు వంటి విషయాలకు ప్రజలు సహకరించాలని డిసి కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాలరాజ్, నర్సింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ : ఎం.రజితరెడ్డి



లక్ష్మినారాయణకాలనీలో ఓటర్ల ఫారం పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**రామంతాపూర్, జూన్ 27 ప్రభాతవార్త :**
రామంతాపూర్ లక్ష్మినారాయణకాలనీలోని పలు ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ మందముల రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం లక్ష్మినారాయణకాలనీలోని పలు ప్రాంతాల్లో ఓటర్ల ఫారం పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సర్ తో నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలి సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమన్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా సర్ సవరణ జరిగేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలని కోరారు. అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున కూడా ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సవరణ లేదా నమోదు ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మనం సహాయపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ సీనియర్ నాయకులు లూకాస్, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, రాములు, వేణు యాదగిరి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు




ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనలు నిర్వహిస్తున్న కళాకారులు దృశ్యం.

**ఉప్పల్, జూన్ 27 ప్రభాతవార్త :**
మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం యశ్వంత్ దీక్షిత్ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించింది. ఈసందర్భంగా శ్రీ గణపతిమ్ సేవింపరారే, వినాయక కౌతం, జతిస్వరం, బ్రహ్మాంజలి, జనుత శబ్దం, స్వాగతమ్ కృష్ణ, రామాయణ శబ్దం, గరుడ గమన, హనుమాన్ చాలీసా, తిల్లాన, తరంగం, అష్టలక్ష్మిస్తోత్రం తదితర అంశాలను కళాకారులు శ్రీనిక, అనయశ్రీ, రిషిత, హాన్విక, నిషిక, హాసవిత, ఆరాధ్య, మనోజ్ఞ ,సమీక్షా, మనస్విని,అమూల్య, యశస్వి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

## ఓటర్ జాబితా ప్రత్యేక సర్వేను సమర్ధవంతంగా పూర్తి చేస్తాం

### -ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో




**ఎల్‌బినగర్ ప్రతినిధి జూన్ 27, ప్రభాతవార్త:**
ఎల్బీ నగర్ నియోజకవర్గం లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ జాబితా ప్రత్యక సర్వే శనివారం నుండి ప్రారంభమైంది అని ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో తెలిపారు. జోనల్ కార్యాలయం లో సర్ కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎల్బీ నగర్ లో ప్రస్తుతం 6 లక్షల 8 వేలు ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ ఓటర్ జాబితా ప్రత్యేక సర్వే ను సమర్ధవంతంగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నా మని ఆయన అన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు ఆలస్యంగా రావడంతో శనివారం నుండి బూత్ స్థాయి సిబ్బందికి పంపిణీ చేశామన్నారు. మొదటగా ప్రతి బూత్ సిబ్బంది ఇంటింటి గణన చేపడుతారని తెలిపారు. ఈ సర్వే కోసం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, ఈ సర్వే జూలై 24 వరకు జరుగుతుందని జెడ్ సి తెలిపారు. ప్రతి ఇంటికి 2 ఫారాలు ఇస్తామని అందులో అన్ని వివరాలను వెల్లడిస్తారని తెలిపారు. నియోజక వర్గంలో జూలై 24 వరకు నెల రోజుల పాటు ఇంటింటికీ సర్వే జూలై 31 ముసాయిదా ఓటర్ జాబితా విడుదల చేస్తామనీ అనతరం అక్టోబర్ 1 నా తుది జాబితాను సిద్ధం చేస్తామని అన్నారు. నియోజక వర్గంలో సర్ సర్వే ను పక్కాగా చేపట్టేందుకు 11 ఏ ఈ ఈ ఆర్ ఓ లు తో పాటు 577 పోలింగ్ కేంద్రాలకు 577 మంది చొప్పున సిబ్బంది ని నియమించారు. ఏ ఈ ఈ ఆర్ ఓ లు,కమిషనర్లు, సహాయ మున్సిపల్ కమిషనర్ లు, తహసీ ల్దార్లు ఈ సర్వే పూర్తి అయ్యేంటే వరకు పాల్గొంటారాని వారు తెలిపారు. ఈ సర్వేలో బీ ఎల్ ఆర్ లు ఇంటికి వచ్చినా సమ యంలో ఓటర్లు అందుబాటులో లేకున్నా ఓట్ హక్కు కోల్పో తామనే భయం అవసరంలేదని జోనల్ కమిషనర్ తెలిపారు.

### విద్యుత్ సరఫరా లో అంతరాయం : ఏఈ రామకృష్ణ...

**కుషాయిగూడ జూన్ 27, ప్రభాతవార్త.**
11 కెవి కుషాయిగూడ... విద్యుత్ మరమ్మతుల కారణంగా కుషాయిగూడ సబ్స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రామ కృష్ణ తెలిపారు.విద్యుత్ మరమ్మతులలో భాగంగా చెట్లు నరికే కార్యక్రమా న్ని పురస్క రించుకొని కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని కుషాయిగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఈనెల 28 ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదేవిధంగా లెవెన్ కె.వి పద్మావతి విద్యుత్ ఫీడర్ పరిధిలోని తులసి హాస్పటల్ ఏరియా నిర్మల లాడ్జి తల్లూరి థియేటర్ ఏరియా ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాలలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.